

జయజయహే జగజ్జనని..!

నేటి నుంచి దేవీ శరన్నవరాత్రులు

ఆలయాల ముస్తాబు

నెల్లూరు (సాంస్కృతికం) : మహాకాళి, మహాలక్ష్మి, మహా సరస్వతి స్వరూపిణిగా జగన్మాత అసుర సంహారానికి సాగించిన ఘట్టాలే దేవీ నవరాత్రులు. శరత్ రుతువు ప్రారంభంతో ఆశ్వీయుజ మాసంలో మొదలయ్యే తొలి తొమ్మిది రోజులను శరన్నవరాత్రులుగా ఉత్సవాలు జరుపుకుంటాము. రాక్షస సంహారం పూర్తయిన సందర్భంగా పదో రోజును విజయ దశమి పండుగ చేసుకుం టారు. ఈ దసరా సంబరాల్లో అమ్మణ్ణి రోజుకో అవతారంలో భక్తులను అను గ్రహిస్తారు. జగజ్జనని, లోకపావని అయిన ఆ తల్లి అనుగ్రహం కోరుతూ విశేష అభిషేకాలు, పూజలు, వాహనసేవ లు, హోమాలు నిర్వహిస్తారు. గురువారం నుంచి ఈ నెల 12వతేదీ వరకు జరిగే శరన్నవరాత్రి ఉత్సవాలకు జిల్లాలో భారీ ఎత్తున ఏర్పాట్లు చేశారు. నెల్లూరులోని రాజరాజేశ్వరి, ఇరుకళల పరమేశ్వరి, మూలస్థానేశ్వరాలయంలోని భువనేశ్వరి, ధర్మరాజుల స్వామి ఆలయంలోని ద్రౌపదీ దేవికి, స్టోన్‌హౌస్‌పేట వాసవీ కన్యకాపరమేశ్వరి, నర్రవాడ వెంగమాంబ పేరంటాళ్ల వంటి ప్రముఖ ఆలయాలలోపాటు అన్ని మహాలక్ష్మీ ఆలయాల్లో 10రోజులపాటు శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవోపేతంగా జరగనున్నాయి. ఇందుకోసం ఆలయాలను భారీఎత్తున విద్యుద్దీపాలు, ఆర్చిలు, తోరణాలతో శోభాయమానంగా అలంకరించారు. ప్రధాన ఆలయాల్లో భక్తులకు అసౌకర్యం కలుగకుండా క్యూలైన్లు, ప్రసాదా లు, ఇతర ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అన్ని శాఖల సమన్వయంతో దసరా ఉత్సవాలను విజయవంతం చేసేలా యంత్రాంగం సిద్ధమైంది.

● ముస్తాబైన జొన్నవాడ

బుచ్చిరెడ్డిపాళెం : భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతున్న జొన్నవాడలోని కామాక్షితాయి సన్నిధిలో శరన్నవరాత్రి ఉత్సవాలు వేడుకగా జరగనున్నాయి. గురువారం రాత్రి కలశస్థాపనతో ఈ ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. తొమ్మిది రోజులపాటు రోజుకో అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. శుక్రవారం త్రిపురాంబికగాను, 5వ తేదీన రక్తబీజవధ, 6న మధుకైటభవధ, 7న రాజరాజేశ్వరి, 8న బండాసురవధ, 9న సరస్వతి, 10న దుర్గా (దుర్గాష్టమి), 11న మహిషాసురమర్దినిగా అమ్మవారు దర్శనం ఇవ్వనున్నారు. 12న విజయదశమి. రాత్రి శమీపూజ, అశ్వవాహన సేవ ఉంటుంది. సంతానలేమితో బాధపడే మహిళలు సంతానం కోరి ఆలయంలో అమ్మవారికి అభిముఖంగా నిద్రిస్తారు. అదేవిధంగా ఇతర బాధలు, సమస్యలు, రోగాలు, ఆర్థిక, ఉద్యోగ తదితర బాధలతో ఉన్నవారు దీక్షబూని 9రోజులపాటు ఆలయ ప్రదక్షిణలు చేస్తారు. ఈ మేరకు ఆలయంలో పటిష్ఠ ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈవో శ్రీనివాసులురెడ్డి తెలిపారు. స్వామి, అమ్మవార్లకు నగదు, ఆభరణాలు విరాళాలుగా ఇవ్వదలచిన భక్తులు ఆలయంలో అధికారులకు అందజేసి రశీదులు పొందాలని కోరారు.



● పెంచలకోనలో..

రాపూరు : పెనుశిల కోన క్షేత్రంలోని ఆదిలక్ష్మి అమ్మవారికి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరగనున్నాయి. గురువారం నుంచి ఈ నెల 12వ తేదీ వరకు జరిగే దసరా సంబరాలకు ఆలయాలను విద్యుద్దీపాలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు.

● కలుగోళమ్మ ఆలయం కళకళ

కావలి : గ్రామదేవత కలుగోళ శాంభవి ఆలయం నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబైంది. ఈ సంబరాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. పట్టణంలోని విష్ణాలయం, కన్యకాపరమేశ్వరి ఆలయం, దుర్గాదేవి, శివాలయం, మహాలక్ష్మమ్మ ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు జరగనున్నాయి. బృందావనం కాలనీలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో నవరాత్రి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి.

ఉత్సవాలకు పటిష్ఠ బందోబస్తు

నెల్లూరు (క్రైం) : రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో గురువారం ప్రారంభం కానున్న శరన్నవరాత్రి ఉత్సవాలకు పోలీసు శాఖ పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసింది. ఆలయం వద్ద పోలీసు కంట్రోల్‌రూమ్‌ను ఏర్పాటు చేసి, 130 మందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. నగర డీఎస్పీ డి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ముగ్గురు సీఐలు, ఏడుగురు ఎస్‌ఐలు, 15 మంది ఏఎస్‌ఐ, హెడ్‌కానిస్టేబుళ్లు, 74 మంది కానిస్టేబుళ్లు, 20 మంది మహిళా కానిస్టేబుళ్లు బందోబస్తు విధుల్లో ఉంటారు. బుధవారం రాత్రి బందోబస్తు విధులకు హాజరైన సిబ్బందికి డీఎస్పీ శ్రీనివాసరెడ్డి దిశానిర్దేశం చేశారు. క్రైమ్ పార్టీలు అప్రమత్తంగా ఉంటూ అనుమానాస్పద వ్యక్తులు. నేరస్థుల కదలికలపై నిఘా ఉంచాలని సూచించారు. డీఎస్పీ వెంట దర్గామిట్ట, సంతపేట, వేదాయపాలెం ఇన్‌స్పెక్టర్లు రోశయ్య, మద్ది శ్రీనివాసరావు, కిషోర్‌కుమార్ తదితరులు ఉన్నారు.



విద్యుద్దీప కాంతుల్లో వెలుగులీనుతున్న నెల్లూరు నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయం



నెల్లూరు : విద్యుద్దీప కాంతుల్లో మూలస్థానేశ్వరుడి ఆలయం

ఉత్సవ శోభ




కావలి పట్టణంలోని కలుగోళ శాంభవి అమ్మవారి ఆలయం

పురప్రజలకు 'చెత్త' విముక్తి!

పన్ను రద్దు చేస్తూ సీఎం ప్రకటన

నగర, పట్టణవాసులకు భారీ ఊరట





నెల్లూరు (సిటీ), అక్టోబరు 2 : చెత్త పన్నును రద్దు చేస్తు కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం నెల్లూరు నగర వాసులకు భారీ ఊరటనిచ్చింది. బుధవారం మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా మచిలీపట్నంలో జరిగిన కార్యక్రమంలో సీఎం చంద్రబాబు స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్‌కు పిలుపునిస్తూనే వైసీపీ సర్కారు విధించిన చెత్తపై పన్నును రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. సీఎం ప్రకటనతో నెల్లూరులో రూ.29.18 కోట్ల మేర పన్ను రద్దు అయినట్టు అయింది. 2022, జూన్‌లో జగన్ ప్రభుత్వం చెత్తపై పన్ను విధిస్తూ నిర్ణయం తీసుకుంది. దీంతో ఇప్పటివరకు (సెప్టెంబరు ఆఖరు) 1,80,797 అసెస్‌మెంట్లకు రూ.35.40 కోట్ల మేర వసూలు చేయాల్సిన పన్ను పేరుకుపోయింది. ఇందులో పలు సచివాలయాల ద్వారా ఇప్పటివరకు రూ. 6.22 కోట్లు వసూలు చేశారు. ఇంకా రూ.29.18 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా ఏపీ ప్రభుత్వం తాజాగా ప్రకటించిన రద్దుతో ఆ మొత్తం మాఫీ అయింది. రెసిడెన్షియల్, కమర్షియల్, అపార్టుమెంట్లదారులకు ప్రభుత్వ ఈ ప్రకటన భారీ ఆర్థిక ఊరటనిచ్చింది. అయితే, ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు అధికారికంగా వెలువడాల్సి ఉంది.

● **కావలి :** మున్సిపాలిటీకి గతంలో క్లాప్‌ఆటోలను కాంట్రాక్ట్ పద్ధతిపై తీసుకుని, వాటి వినియోగంతో చెత్త పన్ను వసూళ్లు చేపట్టారు. ప్రతి ఇంటికి సుమారు రూ. 100 వరకు వసూలు చేశారు. వాస్తవంగా క్లాప్ ఆటోలు తిరిగే ప్రాంతాల్లో మాత్రమే చెత్త పన్ను వసూలు చేసి, దాన్ని కాంట్రాక్టర్‌కు చెల్లించాలనేది అప్పటి ప్రభుత్వ నిర్ణయం. అయితే మున్సిపల్ అధికారులు పట్టణంలోని 40 వార్డుల్లోనూ చెత్త పన్ను వసూలు చేయటంతో ప్రజల్లో వ్యతిరేకత వచ్చింది. ఆ తర్వాత క్లాప్ ఆటోలు తిరిగే ప్రాంతాల్లో, వ్యాపారసంస్థల్లో చెత్త పన్నులు వసూలు చేస్తుండేవారు. వసూలు చేసిన పన్ను క్లాప్ ఆటోల కాంట్రాక్టర్‌కు చెల్లించకపోవటంతో డ్రైవర్లు పని మానేశారు. ఫలితంగా అవి తిరగకుండా మూలనపడ్డాయి. ఈ క్రమంలో సీఎం చంద్రబాబు చెత్త పన్నును రద్దు చేయటంతో పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కందుకూరు : పట్టణంలో 17,616 గృహాలు ఉండగా నెలకు రూ.60 చొప్పున ప్రతినెలా మున్సిపాలిటీకి రూ.10,56,960 వసూలు అయ్యేది. అయితే 4 నెలల నుంచి చెత్తపన్ను వసూళ్లను నిలిపేశారు. గత ప్రభుత్వం హయాంలో గృహవాసులు సగం మంది మాత్రమే చెత్త పన్ను చెల్లించగా, మున్సిపాలిటీకి సుమారు రూ.30 లక్షలు బకాయిపడ్డారు. నాలుగు నెలలు చెత్తపన్ను వసూలు చేయకపోవడంతో మరో రూ.40 లక్షలు బకాయిలు ఉన్నాయి. మొత్తంగా సుమారు రూ.70 లక్షల చెత్తపన్ను బకాయిలు రద్దు కావడంతో పట్టణవాసుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. కాగా, ఆత్మకూరులో ఆదినుంచి చెత్తపన్ను వసూలు చేయడం లేదు.

'టెట్'కు సర్వం సిద్ధం!

నేటి నుంచి 21వ తేదీ వరకు పరీక్షలు

జిల్లాలో 4 కేంద్రాలు.. 9,350 మంది అభ్యర్థులు

గంట ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలి

ప్రత్యేక అధికారులతో పర్యవేక్షణ

నెల్లూరు (విద్య), అక్టోబరు 2 : నిరుద్యోగ డీఎస్సీ అభ్యర్థులకు సంబంధించి ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నిర్వహణకు విద్యాశాఖ సర్వం సిద్ధం చేసింది. ఈ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు గురువారం నుంచి 21వతేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. జిల్లాలో 9,350 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరవుతుండగా, జిల్లావ్యాప్తంగా నాలుగు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. 19 రోజులపాటు జరిగే పరీక్షలకు అభ్యర్థులు వారికి కేటాయించిన కేంద్రాలకు గంట ముందుగా చేరుకోవాలని, మొబైల్స్, బ్లూటూత్, స్మార్ట్‌వాచీలు, ఇతర ఎలక్ట్రానిక్ గాడ్జెట్‌లను అనుమతించమని అధికారులు స్పష్టం చేశారు. అలాగే అభ్యర్థులు ఆధార్, ఓటర్, డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డులలో ఏదో ఒక గుర్తింపు కార్డుతో హాజరు కావాలని స్పష్టం చేశారు.

● రెండు విడతల్లో పరీక్షలు

ఏపీ టెట్ పరీక్షలను రెండు సెషన్లలో నిర్వహిస్తున్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఒక సెషన్, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండో సెషన్ ఉంటుంది. కావలి పీబీఆర్ విశ్వోదయా కళాశాలలో 2,310 మంది, రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో 1,980 మంది, నెల్లూరులోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో 700 మంది, నెల్లూరు రూరల్‌లోని అయాన్ డిజిటల్ జోన్‌లో 4,360 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోని అభ్యర్థులు వెంటనే ఛిట్స్‌ఇజౌలి.జీ వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలి. స్క్రైబ్ కేటాయించిన దివ్యాంగ అభ్యర్థులకు 50 నిమిషాల అదనపు పరీక్ష సమయాన్ని కేటాయించనున్నారు. హాల్‌టికెట్‌లో ఫొటో లేకపోయినా, సరిగా కనిపించకపోయినా, చిన్నసైజులో ఉన్నా అభ్యర్థి రెండు పాస్‌పోర్టు సైజు ఫోటోలు తీసుకుని వెళ్లి డిపార్ట్‌మెంటల్ అధికారికి సమర్పించి అనుమతి పొందాలని అధికారులు సూచించారు. అలాగే హాల్‌టికెట్‌లో ఏదైనా తప్పులు, పొరపాట్లు ఉంటే పరీక్ష కేంద్రంలోని డిపార్ట్‌మెంటల్ అధికారి వద్ద ఉన్న నామినల్ రోల్స్‌లో సరైన ఆధారాలు చూపించి సరిచేయించుకోవచ్చు.

● హెల్ప్‌లైన్ కేంద్రం

టెట్ అభ్యర్థుల సందేహాలను నివృత్తి చేసేందుకు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో హెల్ప్‌లైన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. 9441148062, 7893258325, 6305364463 నెంబర్లకు ఫోన్ చేయాలని అధికారులు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఒక అభ్యర్థి స్థానంలో మరొకరు పరీక్షకు హాజరైనా, మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడినా చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పీబీఆర్ విశ్వోదయా కళాశాలకు కావలి ఎంఈఓ-2 సీహెచ్.వెంకటసుబ్బయ్య, రామిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలకు బోగోలు ఎంఈఓ-2 ఎం.జయమ్మ, నారాయణ ఇంజనీరింగ్ కళాశాలకు నెల్లూరు అర్బన్ ఎంఈఓ-2 ఎస్‌డీ.అబ్దుల్ హమీద్, ఇయాన్ డిజిటల్ జోన్‌కు నెల్లూరు రూరల్ ఎంఈఓ-2 ఆర్.మురళీధర్‌ను డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లుగా నియమించారు. ఈ పరీక్షలకు రాష్ట్ర ఓపెన్ స్కూల్ డైరెక్టర్ కె.నాగేశ్వరరావును జిల్లా పరిశీలకులుగా నియమించారు. ఆయనతోపాటు డీఈఓ రామారావు, కావలి డిప్యూటీ ఈఓ పి.రఘురామయ్య, నెల్లూరు డిప్యూటీఈఓ కె.లక్ష్మీ ప్రసన్నలు పర్యవేక్షించనున్నారు.

మద్యం పాలసీపై భగ్గు

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 2 : నూతన మద్యం పాలసీని రద్దు చేయాలంటూ బుధవారం నెల్లూరులో ఐద్వా మహిళలు నిరసన వ్యక్తం చేశారు. తొలుత పుచ్చలపల్లి విగ్రహం నుంచి గాంధీబొమ్మ వరకు ప్రదర్శన నిర్వహించారు. గాంధీ విగ్రహం ఎదుట మద్యం సీసీలను పగలగొట్టి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం గాంధీకి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శివకుమారి, మస్తాన్‌బీ మాట్లాడుతూ యువత భవితను, మహిళల జీవితాలను నాశనం చేస్తున్న మద్యానికి టార్గెట్ పెట్టి అమ్మకాలు చేయటం సిగ్గుచేటని మండిపడ్డారు. విద్య, వైద్యం, ఉపాధి అంశాలపై దృష్టి పెట్టకుండా ఉచిత పథకాల చుట్టూ రాజకీయాలు చేస్తూ మద్యం అమ్మకాలను ఆదాయ వనరులుగా చూడటం విచారకరమన్నారు. మద్యాన్ని నిషేధించాలని, నూతన మద్యం పాలసీని రద్దు చేయాలని అలా చేయకపోతే ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసనలో ఐద్వా నాయకురాళ్లు సుబ్బమ్మ, కత్తి పద్మ, సంపూర్ణ, షేక్ మహమ్మదా, షేక్ షాహిన్, షకీలా, లక్ష్మి, వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.



గాంధీ విగ్రహం ఎదుట మద్యం సీసాలను పగల కొడుతున్న ఐద్వా మహిళలు

'స్వచ్ఛతా హీ సేవ' విజయవంతం

● శ్రమదాన అవార్డుల ప్రదానం

నెల్లూరు, (జడ్పీ), అక్టోబరు 2: జిల్లాలో 15 రోజులుగా నిర్వహించిన 'స్వచ్ఛతా హీ సేవ' కార్యక్రమా లు విజయవంతంగా నిర్వహించినట్లు కలెక్టర్ ఆనంద్ తెలిపారు. బుధవారం నెల్లూరులోని కస్తూర్బా కళాక్షేత్రంలో 'స్వచ్ఛతా హీ సేవ' కార్యక్రమం ముగింపు వేడుక జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 10వేల ఆవాసాలను గుర్తించి, చెత్తాచెదారం తొలగించినట్లు పేర్కొన్నారు. మున్సిపల్, పంచాయతీ, విద్యాశాఖలతోపాటు వివిధ స్వచ్ఛంద సంస్థలు పాల్గొని సహకరించాయని, అందరికీ అభినందనలు అంటూ కొనియాడారు. అనంతరం 'స్వచ్ఛతా హీ సేవ' కార్యక్రమంలో విశిష్ట సేవలు అందించిన అధికారులకు, సిబ్బందికి శ్రమదాన అవార్డులను అందజేశారు. ముందుగా జాతిపిత మహాత్మా గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జేసీ కార్తీక్, జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ, జడ్పీ సీఈవో ఖాదర్ బాషా, డీపీవో సుస్మితారెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ ఆనంద్, పక్కన జేసీ, జడ్పీ చైర్‌పర్సన్, కమిషనర్ తదితరులు

● **నెల్లూరు (హరనాథపురం) :** కలెక్టరేట్‌లో మహాత్మా గాంధీ విగ్రహానికి జేసీ కార్తీక్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో లవన్న తదితరులు పాల్గొన్నారు.

అటు కొరత.. ఇటు ధర మోత!

● 'రబీ' ఆరంభంలోనే ఎరువుల దరువు

● కృత్రిమ కొరత సృష్టిస్తున్న వ్యాపారులు

● డీఏపీ, యూరియా బ్లాక్ మార్కెట్

● బస్తా రూ. 100 నుంచి 150లకు అదనంగా విక్రయం

● గగ్గోలు పెడుతున్న కర్షకులు



కందుకూరు, అక్టోబరు 2 : రబీ సీజన్ ప్రారంభానికి ముందే ఎరువుల కొరత రైతులను వేధిస్తోంది. ఇదే అదనుగా వ్యాపారులు బ్లాక్ మార్కెటింగ్‌తో భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. డీఏపీ, యూరియా బ్లాక్ మార్కెట్ నడుస్తుండగా మిగిలిన కాంప్లెక్స్ ఎరువులు సైతం బస్తాకు రూ.30 నుంచి 50లకు అదనంగా వసూలు చేస్తున్నారు. ఇది రైతులపై అదనపు భారం పడుతోంది. కందుకూరు వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో ఇటీవల కురిసిన వర్షపు జల్లులతో ముమ్మరంగా వ్యవసాయ పనులు జరుగుతున్నాయి. జామాయిల్ నాట్లు ముమ్మరంగా వేస్తుండటంతోపాటు ముదురు జామాయిల్‌కు ఎరువులు ఎదబెట్టడం, మినుము ఏతలు రైతులు ప్రారంభించారు. మరోపక్క తేలికనేలల్లో పొగాకు సాగుకు అదును దాటుతుండటంతో ఈదఫా వర్షం కురిస్తే నాట్లు వేయాలన్న ఆలోచనతో రైతులు ఎరువులు ఎదబెట్టి భూములను సిద్ధం చేస్తున్నారు. మరోపక్క మిరపనాట్లు కూడా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎరువుల వినియోగం గణనీయంగా పెరిగింది.

● బస్తాకు అదనంగా రూ.150 వసూలు

రైతులు ఒక్కసారిగా ఎరువుల కోసం వ్యాపారుల వద్దకు వెళ్లటం ప్రారంభిం చటంతో డిమాండ్ నెలకొని ధరలు పెంచేసి బ్లాక్ మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. డీఏపీ, యూరియాలను అధిక ధరలకు విక్రయిస్తున్నారు. డీఏపీపై పట్టణ ప్రాంతాల్లో బస్తాకు వంద రూపాయలు, గ్రామీణ ప్రాంతాలలో రూ.150 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. డీఏపీ బస్తా ఎంఆర్‌పీ రూ.1350 కాగా కందుకూరులో రూ.1450 వరకు వసూలు చేస్తున్నారు. వలేటివారిపాలెం, పోకూరు, లింగసముద్రం, పెదపవని, గుడ్లూరు, ఉలవపాడు, కరేడు ప్రాంతాలలో డీఏపీ బస్తాను రూ.1500లకు విక్రయిస్తున్నారని రైతులు వాపోతున్నారు. అలాగే 266 రూపాయలకు అమ్మాల్సిన యూరియాను కందుకూరులో రూ.320 వరకు వసూలు చేస్తుండగా మిగిలిన గ్రామీణ ప్రాంతాలో యూరియా బస్తా రూ.350 పలుకుతుండటం విశేషం. అలాగే సింగిల్ సూపర్‌ఫాస్పేట్, కాంప్లెక్స్ ఎరువులపై కూడా బస్తాకు రూ.50 వరకు ఎంఆర్‌పీ కన్నా అదనంగా వసూలు చేయటం పరిపాటిగా మారింది.

● వ్యాపారులదే ఇష్టారాజ్యం

రైతు సేవాకేంద్రాలు, సహకార సంఘాలలో ఎరువుల నిల్వలు లేకపోవటంతో వ్యాపారుల ఇష్టారాజ్యంగా మారిందని రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఎంత ధర చెప్పినా అదనులో పని చేయాలి కనుక కొనుగోలు చేయకతప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే డీఏపీ ఇవ్వాలంటే అంతగా డిమాండ్ లేని కొన్ని కాంప్లెక్స్ ఎరువులను తీసుకోవాల్సిందేనని కంపెనీలు ఒత్తిడి మేరకు విక్రయిస్తున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. అలాగే యూరియాను కూడా ఎంఆర్‌పీకి కంపెనీలే తమకు సరఫరా చేయటం లేదని అంటున్నారు. ఈ సమస్యపై వ్యవసాయాధికారులను వివరణ కోరగా డీఏపీ, యూరియాకు డిమాండ్ కారణంగా కొంత అదనంగా వసూలు చేస్తున్నారన్న సమాచారం తమకు కూడా ఉందని తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకుంటామని సమాధానం ఇవ్వడం విశేషం.

విద్యార్థులకు ప్రత్యేక ఐడీలు

● ఏపీఏఏఆర్ పేరుతో రిజిస్ట్రేషన్ ● 14వ తేదీకి పూర్తిచేయాలని ఆదేశం

నెల్లూరు (విద్య), అక్టోబరు 2 : జాతీయ విద్యావిధానం అమలులో భాగంగా కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్రంలోని పాఠశాలల్లో విద్యార్థులందరికీ ప్రత్యేక గుర్తింపు (ఐడీ) కార్డులను రూపొందించేలా చర్యలు తీసుకోవాలని డీఈవోలకు ఆదేశాలిస్తూ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు ఉత్తర్వులు జారీ చేశారు. విద్యార్థుల పురోగతి, విజయాలను ట్రాక్ చేసేలా రూపొందిస్తున్న ఈ గుర్తింపుకార్డు(ఐడీ)ను వేగవంతంగా సిద్ధం చేయాలని ఆ ఉత్తర్వుల్లో ఆదేశించారు. దీనిని ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (ఏపీఏఏఆర్)పేరుతో పిలుస్తారని, ఈ ఐడీ విద్యార్థికి జీవితకాలం ఉంటుందని, ఆ విద్యార్థికి సంబంధించిన వివరాలన్నీ కూడా దేశంలోని ఏప్రాంతం నుంచైనా పరిశీలించుకునేం దుకు సహాయపడుతుందని తెలిపారు. దీనిలో పరీక్ష ఫలితాలు, సంపూర్ణ నివేదిక కార్డులు, అభ్యాస ఫలితాలు, ఇతర పాఠ్యాంశ విజయాలు వంటి సమాచారం కూడా డిజిటల్‌గా నిల్వ చేసేలా సిద్ధం చేస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థుల ఆధార్ కార్డును అనుసంధానం చేస్తూ రూపొం దించే ఈ ఐడీ కార్డుల కోసం తల్లిదండ్రుల నుంచి ప్రత్యేక అనుమతి తీసుకోవాలని, వివరాలన్నీ గోప్యంగా ఉంచుతామని తల్లిదండ్రులకు అధికారులు తెలియచేయాలని సూచించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోని విద్యార్థులందరి వివరాలను అక్టోబరు 14వతేదీలోపు రాష్ట్ర విద్యాశాఖ అందించాలని ఆదేశాల్లో తెలిపారు. పాఠశాలల్లోని ప్రధానోపాధ్యాయులు తల్లిదండ్రుల సమ్మతి పత్రాలను సిద్ధం చేసి దసరా సెలవుల్లో వీటిని నిర్ధారించుకుని తల్లిదండ్రుల సంతకాలతో సమ్మతి పత్రాలను ఉన్నతాధికారులకు అందించాల న్నారు. అధికారులు, సిబ్బంది తల్లిదండ్రులతో మాట్లాడి, దీనిపై అవగాహన కల్పించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా వారిని సంసిద్ధులను చేయాలన్నారు. అవసరమైతే విద్యాశాఖలోని అన్ని విభాగాల సిబ్బందితో కలిసి తల్లిదండ్రులతో సమావేశాలు ఏర్పాటు చేసి సంసిద్ధత పత్రాలను అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. కాగా, ఈ కార్యక్రమాన్ని జిల్లాలో వేగవంతంగా పూర్తి చేసి నివేదికలు అందచేస్తామని జిల్లా అధికారులు తెలిపారు.

పర్యాటక కేంద్రంగా గాంధీ ఆశ్రమం

● జాతిపిత జయంతి వేడుకలో కలెక్టర్ ఆనంద్



రాట్నంతో నూలు నేస్తున్న కలెక్టర్ ఆనంద్

ఇందుకూరుపేట, అక్టోబరు 2 : దక్షిణ సబర్మతిగా పిలవబడుతున్న పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ తెలిపారు. మండలంలోని పల్లిపాడు పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో కన్వీనర్ కల్పనమ్మ ఆధ్వర్యంలో బుధవారం జాతిపిత మహాత్మాగాంధీ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డితో కలసి జిల్లా కలెక్టర్ ఆనంద్ పాల్గొన్నారు. మహాత్మగాంధీ, ఆశ్రమ స్థలదాత పొణక కనకమ్మల విగ్రహాలకు నూలుమాలలు, పట్టు వస్త్రాలు, పూలమాలలు సమర్పించి ఘన నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ గాంధీ ఆశ్రమం చరిత్ర జిల్లా వ్యాప్తంగా తెలియజేయాలన్నారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు దీని సందర్శనకు రావాలని సూచించారు. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ మహాత్మాగాంధీ నడయాడిన పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమం అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. అనం తరం పలు పాఠశాలల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. అనంతరం డాక్టర్ ఇందిరమ్మ ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ సురేష్‌నాయుడు, ట్రెజరర్ సురేష్‌జైన్, ఆశ్రమ అడ్వైజర్ గుణపాటి ప్రసాద్‌రెడ్డి, రవి ప్రకాష్, రాజేంద్రప్రసాద్, ప్రసన్నాంజనేయులు, రంగయ్యనాయుడు, శ్రీహరిరెడ్డి, సుకుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దేశాన్ని సంఘటితం చేసిన బాపూజీ

● టీడీపీ నేత బీద రవిచంద్ర



టీడీపీ కార్యాలయంలో జరిగిన గాంధీ జయంతిలో పాల్గొన్న రవిచంద్ర, అజీజ్ తదితరులు

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 2 : సమాచార సాధనలు, మీడియా విస్తృతంగా లేని రోజుల్లో ఒక్క పిలుపుతో యావత్ దేశాన్ని సంఘటితం చేసిన నాయకుడు మహాత్మా గాంధీ అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీదా రవిచంద్ర కొనియాడారు. బుధవారం గాంధీ జయంతి సందర్భంగా నెల్లూరులోని గాంధీ విగ్రహానికి టీడీపీ నాయకులు పుష్పమాలలు వేసి నివాళులర్పించారు. రవిచంద్ర మాట్లాడుతూ పదునైన ప్రసంగాలు, చైతన్యపరిచే లేఖలతో దేశ ప్రజలలో స్వాతంత్ర్య కాంక్షను, ఉద్యమస్ఫూర్తిగా రగిలించిన నేత గాంధీజీ అని, నేటి యువత బాపూను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు నడవాలని పిలుపునిచ్చారు. అంతకుముందు తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, నాయకులతో కలిసి గాంధీ చిత్రపటానికి పుష్పమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు దర్శి హరికృష్ణ, దోర్నాల హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

మైపాడులో చోరీ

● 37 సవర్ల బంగారం, రూ.1.75 లక్షల అపహరణ

ఇందుకూరుపేట, అక్టోబరు 2 : మండలంలోని మైపాడులో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన ఘటన బుధవారం వెలుగుచూసింది. పోలీసుల కథనం మేరకు.. మైపాడుకు చెందిన ఆర్ఎంపీ కొసనం కోటేశ్వరరావు ఇంటికి తాళం వేసుకుని కుటుంబ సభ్యులతో కలసి హైదరాబాదుకు వెళ్లారు. ఇది గమనించిన దొంగలు మంగళవారం రాత్రి ఆ ఇంటి తాళాలు పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించి బీరువా పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. బుధ వారం ఉదయం ఇంటి తాళాలు పగలగొట్టి ఉన్న విషయాన్ని గుర్తించిన పక్కింటి వాళ్లు ఆ ఇంటి యజమానికి సమాచారం ఇచ్చారు. దీంతో హుటాహుటిన గ్రామానికి చేరుకున్న కోటేశ్వర రావు ఇంట్లో పరిశీలించారు. బీరువాలో ఉంచిన 37 సవర్ల బంగారు ఆభరణాలు, రూ.1,75,000, వెండి వస్తువులు దుండగులు అపహరించుకుని పోయినట్లు గుర్తించారు. ఈ మేరకు బాధితుడు ఇందుకూరుపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న డీఎస్పీ శ్రీనివాసులు నాయుడు, సీఐ సుధాకర్‌రెడ్డి, ఎస్ఐ నాగార్జునరెడ్డి లు సంఘటన స్థలానికి చేరుకుని దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



ఇంటిలో పరిశీలిస్తున్న డీఎస్పీ, సీఐలు

విద్యుత్ మోటార్ల తీగలు..

● లబోదిబోమంటున్న రైతులు

జలదంకి,, అక్టోబరు 2: మండలంలోని బీకే అగ్రహారం పంటపొలాల్లో మంగళవారం అర్ధరాత్రి 30 విద్యుత్ మోటార్లకు సంబంధించిన కేబుల్ వైర్లను దుండగులు చోరీ చేశారు. వ్యవసాయబోర్లకు, చీకటివాగులో బిగించి ఉన్న ఓపెన్‌వెల్ మోటార్ల వైర్లను దొంగలు చోరీ చేసి, అందులో ఉన్న రాగిలీడ్‌లను తీసుకెళ్లారు. బుధవారం ఉదయం పొలాల్లోకి వెళ్లిన రైతులు వైర్లు దొంగలించిన విషయాన్ని గుర్తించి లబోదిబోమన్నారు. ఒక్కో మోటారు నుంచి దొంగలించిన వైరులో ఉన్న రాగి అమ్ముకుంటే వచ్చేది రూ.200లే. కేబుల్‌వైరు దొంగలించడం వల్ల రైతులకు వేలల్లో ఖర్చుతో పాటు మళ్లీ బోర్లలో మోటారును బయటకు తీసి బిగించే శారీరక శ్రమతోపాటు మెకానిక్‌కు అయ్యే ఖర్చు అధికంగా ఉంటుంది. ఈ చోరీ పట్ల రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.



బీకే అగ్రహారంలో కేబుల్‌వైరులో రాగి లీడ్‌ను చోరీ చేసిన దుండగులు

మిక్సింగ్ ప్లాంటులో తారు డబ్బాల..

కావలి రూరల్, అక్టోబరు2: మండలంలోని రుద్రకోట సమీపంలో జాతీయ రహదారి పక్కన ఉన్న తారు మిక్సింగ్ ప్లాంటులో మంగళవారం రాత్రి తారు డబ్బాలు చోరీకి గురైనట్లు వాచ్‌మన్ బుధవారం గుర్తించాడు. ఈ విషయాన్ని ప్లాంటు యజమాని దశరథరామి రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ప్రకాశం జిల్లా కందుకూరు, కొండేపి ప్రాంతాల్లో జరుగుతున్న రోడ్ల నిర్మాణం కోసం నిల్వ చేసిన తారు డబ్బాలను దొంగిలించుకు పోయారని బాధితుడు తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	123
లేయర్ లైవ్	110
స్కిన్ చికెన్	222
స్కిన్‌లెస్	248
లేయర్	187

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7316
వెండి కిలో ధర	రూ. 93,200
వెండి ఒక గ్రాము	రూ. 96.20

కమ్మవారిపాలెంలో ..

● రూ.లక్ష నగదు, బంగారం అపహరణ

కలిగిరి: మండలంలోని కమ్మవారిపాలెంలో మంగళవారం అర్ధరాత్రి పొన్నగంటి అంకమ్మ ఇంట్లో దుండగులు చోరీకి పాల్పడ్డారు. రూ. నగదు. ఆరు సవర్ల బంగారు నగలు అపహరించారు. పోలీసుల కథనం మేరకు, వృద్ధురాలు అంకమ్మ, ఆమె కుమార్తె మహాలక్ష్మమ్మ మంగళవారం రాత్రి ఇంటి వరండాలో నిద్రించారు. దుండగులు తల దిండు కింద ఉన్న తాళాలను తీసుకొని చోరీకి పాల్పడ్డారు. బియ్యం డబ్బాలో దాచుకున్న రూ. లక్ష నగదు, బంగారు సరుడు, జత కమ్మలు, రెండు ఉంగరాలు చోరీకి గురయినట్లు బుధవారం బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ ఉమాశంకర్ సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు. నెల్లూరు నుంచి వచ్చిన క్లూస్‌టీమ్ వేలిముద్రల నమూనాలు సేకరించారు.

ఫ్లెక్సీలమయం..!

నెల్లూరు నగరాన్ని ఫ్లెక్సీల రహితంగా చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేస్తాం. రోడ్లపై ఫ్లెక్సీలు కట్టడం మూలంగా రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. ఇకపై ఈ పద్ధతి మారాలి. నెల్లూరులో ఫ్లెక్సీలను తొలగించాలి. సుందరనగరంగా తీర్చిదిద్దేందుకు ప్రతీ ఒక్కరూ సహకరించాలి.

- ఇటీవల నెల్లూరు పర్యటనలో మంత్రి నారాయణ

నగరాలు, పట్టణాలు ఉన్నది ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడానికి కాదు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇష్టారీతిన రోడ్ల పక్కన, వీధి స్తంభాలకు హోర్డింగ్స్, ఫ్లెక్సీలు కడుతున్నారు. దీని మూలంగా రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. రాజకీయ నాయకులే కాకుండా ప్రైవేటు వ్యక్తులు కూడా ఫ్లెక్సీలు కడుతున్నారు. చట్టవిరుద్ధంగా ఏర్పాటవుతుంటే మున్సిపల్ అధికారులు ఏం చేస్తున్నారు..? వాటిని తొలగించాల్సిన బాధ్యత వారిది కాదా..?

- ఫ్లెక్సీల కేసు సందర్భంగా ఇటీవల హైకోర్టు వ్యాఖ్యలు

- నెల్లూరు నగరం నిండా ఫ్లెక్సీలు
- రోడ్లపై ఎక్కడపడితే అక్కడ ఏర్పాటు
- ట్రాఫిక్‌కు అంతరాయం - వాహనదారులకు అసౌకర్యం
- పలు చోట్ల వివాదాలు
- అమలుకాని మంత్రి నారాయణ ఆదేశాలు
- హైకోర్టు హెచ్చరించినా స్పందించని కార్పొరేషన్







నెల్లూరు నగరంలో విచ్చలవిడిగా ఫ్లెక్సీలు వెలుస్తున్నాయి. ప్రతీ చిన్న కార్యక్రమానికి కూడా భారీ సంఖ్యలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం ఫ్యాషన్‌గా మారిపోయింది. రాజకీయ నాయకులే కాకుండా సినీ అభిమానులు, సామాన్యులు కూడా వివిధ కారణాలతో పెద్ద పెద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు. వీటిలో అత్యధికం అనుమతుల్లేనివే!. ప్రతీ జంక్షన్ లోనూ భారీ ఫ్లెక్సీలు కడుతుండ డంతో అవి ఎక్కడ కూలుతాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రోడ్లపై ఫ్లెక్సీల వల్ల వాహనదారులకు తీవ్ర అసౌకర్యం కలుగుతోంది. ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. కొన్ని చోట్ల ఫ్లెక్సీల ఏర్పాటు వివాదాలకు దారితీస్తోంది. దుకాణాల ముందు ఫ్లెక్సీల వల్ల వ్యాపారస్తులకు కూడా అవస్థలు తప్పడం లేదు.

నెల్లూరు నగరం శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. దాదాపు 150 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంతో రాష్ట్రంలోనే నాలుగో అతి పెద్ద నగరంగా నెల్లూరు నిలిచింది. భవిష్యత్‌లో మరింత విస్తరించే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. జనాభా కూడా దాదాపు పది లక్షలకు చేరుకుందని అంచ నా. ఈ తరుణంలో నెల్లూరును సుందర నగరంగా మార్చాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపైనా ఉంది. అందులో ప్రధానమైనది ప్లాస్టిక్, ఫ్లెక్సీల వంటి పర్యావరణ హానికరమైన వాటిని నిరోధించడం. అయితే నెల్లూరు నగరాన్ని ఫ్లెక్సీల సమస్య పట్టిపీడిస్తోంది. ఏ వీధి చూసినా ఫ్లెక్సీలతో నిండిపో తోంది. చిన్న చిన్న సందుల్లో కూడా విచ్చలవిడిగా ఫ్లెక్సీలు కడుతుండడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రధాన రోడ్లు అయిన ట్రంకురోడ్డు, మినీబైపాస్, పొదలకూరు రోడ్లు ఫ్లెక్సీలమయంగా మారిపోయాయి. దీంతో ట్రాఫిక్ సమస్య అధికమవుతోంది. ఈ ఫ్లెక్సీలను తొలగించడం మున్సిపల్ కార్పొరేషన్‌కు పెద్ద సవాల్‌గా మారుతోంది. ఒక ధృడ సంకల్పంతో ఫ్లెక్సీల తొలగింపు కార్యక్రమాన్ని కార్పొరేషన్ అధికారులు చేపట్టలేకపోతున్నారు.

తొలగించినా మళ్లీ మామూలే!

వాణిజ్య ప్రాంతాల్లో దుకాణాల ఎదుట ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తుండడం వ్యాపారస్తులకు ఇబ్బందిగా మారుతోంది. కొన్ని ప్రాంతాల్లో ఈ ఫ్లెక్సీల ఏర్పాటు రాజకీయంగా స్థానికుల మధ్య వివాదాలను సృష్టిస్తోంది. పెద్ద ఫ్లెక్సీలు కూలి గతంలో పలువురికి గాయాలు అయిన సందర్భాలూ ఉన్నాయి. ఫ్లెక్సీలను నియంత్రించాలంటూ ఏళ్ల తరబడి ప్రజల నుంచి అటు ప్రజాప్రతినిధులకు, ఇటు అధికారులకు విజ్ఞప్తులు అందుతున్నప్పటికీ ఫలితం మాత్రం కనిపించడం లేదు. ఇటీవల నెల్లూరు నగరంలో పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ పర్యటించిన సందర్భంగా కూడా ఫ్లెక్సీల అంశం తెరమీదకు వచ్చింది. నగరంలో ఫ్లెక్సీలు తొలగించాలని ఆయన మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఆ వెంటనే కదిలిన యంత్రాంగం ఫ్లెక్సీలను తొలగించింది. కానీ ఇప్పుడు మళ్లీ యధాస్థితి నెలకొంది. మున్సిపల్ అధికారులు ఫ్లెక్సీల తొలగింపు ప్రారంభించడం.. ఎవరో ఒక రాజకీయ నాయకుడు వారిని అడ్డుకుంటుండడంతో వెంటనే ఆ ప్రక్రియ అక్కడితో నిలిచిపోతోంది. వైసీపీ ప్రభుత్వంలో కూడా ఇదే మాదిరిగా ఫ్లెక్సీల రహితంగా నెల్లూరును మార్చాలని ప్రయత్నించి విఫలమయ్యారు. విచ్చలవిడిగా ఫెక్సీలు ఏర్పాటు చేయడంపై ఇటీవల హైకోర్టు కూడా ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇప్పటికైనా మున్సిపల్ యంత్రాంగం ఫ్లెక్సీల తొలగింపును సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం ఉంది.

- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)

వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

● ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

వెంకటాచలం, అక్టోబరు 2 : ఖైదీలు జైలులో ఉన్న సమయాన్ని వృథా చేసుకోకుండా ఇక్కడ నేర్పించే వృత్తులలో నైపుణ్యం పొంది సమాజంలో గౌరవంగా జీవించాలని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని చెముడుగుంట సమీపంలో ఉన్న కేంద్రకారాగారంలో బుధవారం గాంధీ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన ఖైదీల సంక్షేమ దినోత్సవంలో కలెక్టర్ ఓ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్‌లతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఖైదీలు తయారు చేసిన ఫర్నీచర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలిసో తెలియక తప్పు చేసిన ఖైదీలు వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకుంటే శిక్షాకాలం పూర్తయిన తరువాత స్వయంగా ఉపాధి పొందవచ్చన్నారు. గతంలో ఒక ఖైదీ తనకు చెక్కతో తయారు చేసిన అందమైన తాజ్‌మహల్ బహూకరించారని, అది ఇప్పటికీ తన ఇంట్లో భద్రంగా ఉందని తెలిపారు. జైల్లో ఖైదీల వినోదానికి రూ.5 లక్షలతో కలర్ టీవీలను అందించినట్లు పేర్కొన్నారు. పాతికేళ్లుగా ఖైదీల సంక్షేమానికి తమవంతు సహకారం అందిస్తున్నానని, గతంలో మిక్సీలు, వంటపాత్రలు, ఒక వాహనం, అంబులెన్స్ అందించానని పేర్కొన్నారు. స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా జైల్లో మరిన్ని మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. జైలు ప్రాంగణంలో మొక్కలు నాటారు. అనంతరం ఓపెన్ స్కూల్ ద్వారా పదవ తరగతి, ఇంటర్మీడియట్, అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా డిగ్రీ పూర్తి చేసిన ఖైదీలకు సర్టిఫికెట్లు అందజేశారు. పలు క్రీడలు, వ్యాసరచన, వక్తృత్వ, డ్రాయింగ్, పాటల పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ రాజారావు, ఏఎస్పీ మహేష్‌బాబు, డీఎస్పీ సాయిప్రవీణ్, పలువురు జైలు శాఖ అధికారులు పాల్గొన్నారు.



మొక్క నాటి నీరు పోస్తున్న కలెక్టర్ ఆనంద్, పక్కన ఎంపీ ప్రభాకర్ రెడ్డి, ఎస్పీ కృష్ణకాంత్

6 నుంచి ఏపీటీఎఫ్ రాష్ట్రసభలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఈవో రామారావు తదితరులు

నెల్లూరు (విద్య), అక్టోబరు 2 : ఏపీటీఎఫ్ స్థాపించి 80 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా విజయనగరంలో ఈ నెల 6, 7, 8 తేదీల్లో 20వ విద్యా వైజ్ఞానిక రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను బుధవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈవో రామారావు ఆవిష్కరించారు. మహాసభలు విజయవంతం కావాలని, విద్యారంగ పరిరక్షణకు సంఘం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సమగ్రశిక్ష ఏఎంవో సుధీర్‌బాబు, సీఎంవో పెంచలయ్య, జిల్లా అధ్యక్షుడు సురేంద్రరెడ్డి, నేతలు రియాజ్, పిచ్చిబాబు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'సోమశిల'లో 53.207 టీఎంసీల నిల్వ

అనంతసాగరం : సోమశిల జలాశయానికి ఎగువ నుంచి 6,524 క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతోంది. ప్రాజెక్టు సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా.. 53.207 టీఎంసీల నీరు నిల్వ ఉంది. నమోదైంది. దిగువ డెల్టాకు 1000, కండలేరుకు 10వేలు, ఉత్తర 540, దక్షిణ కాలువలకు 5 క్యూసెక్కులు చొప్పున నీటిని సరఫరా చేస్తున్నారు.

త్వరలో సోమేశ్వరాలయ పనుల ప్రారంభం



ఆలయ అభివృద్ధి మ్యాప్‌ను పరిశీలించి దిశానిర్దేశం చేస్తున్న ఆర్‌జేసీ చంద్రశేఖర్ ఆజాద్

అనంతసాగరం, అక్టోబరు 2 : సోమశిల జలాశయం వద్ద వరదలకు ధ్వంసమైన సోమేశ్వరాలయ పునః నిర్మాణ పనులను త్వరలో ప్రారంభించనున్నట్లు రాయసీమ ప్రాంత దేవదాయ శాఖ జాయింట్ కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్ తెలిపారు. గుడి అభివృద్ధి పనులకు దేవదాయ శాఖ రూ.12 కోట్లు మంజూరు చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు పనుల రూపకల్పనపై బుధవారం చంద్రశేఖర్ ఆజాద్ ఆలయాన్ని సందర్శించి, ఆలయ ధర్మకర్త ఉప్పల విజయ్‌కుమార్‌తో చర్చించారు. తుది ప్రణాళిక తయారు చేసి ఉన్నతాధికారులకు అందించి పనులు త్వరగా ప్రారంభించేలా చర్యలు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ జనార్ధన్‌రెడ్డి, డీఈ శ్రీనివాసరావు, ఆలయ ఏవో ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీ అధికారినంటూ బెదిరింపు

- తహసీల్దారుకి సుమారు రూ. 3లక్షలకుపైగా టోకరా
- ఆలస్యంగా వెలుగులోకి ఘటన

చేజర్ల, అక్టోబరు 2 : తహసీల్దార్‌గా పనిచేస్తూ అనారోగ్యంతో సెలవులో ఉన్న చేజర్ల తహసీల్దార్ రమణారావుకు ఏసీబీ అధికారినంటూ ఒకడు టోకరా వేశారు. సుమారు రూ. మూడున్నర లక్షలకుపైగా మోసం చేశాడు. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గత కొద్ది రోజుల క్రితం కార్యాలయంలో ఉన్న తహసీల్దార్ రమణారావుకు గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేశాడు. తాను ఏసీబీ అధికారినంటూ పరిచయం చేసుకున్నాడు. 'నీకు ఆదాయా నికి మించి ఆస్తులు ఉన్నాయి. కేసుపెట్టకుండా ఉండాలంటే సుమారు ఐదు లక్షలకుపైగా నగదు ఇవ్వండి' అంటూ డిమాండ్ చేశారు. దీంతో తహసీల్దార్ తన ఫోన్ పే ద్వారా సుమారు రూ. మూడు లక్షలకుపైగా నగదు చెల్లించినట్లు సమాచారం. అనంతరం తరుచూ ఫోన్ చేస్తుండడంతో అనుమానం వచ్చిన తహసీల్దార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే పోలీసులు ఈ కేసును గోప్యంగా విచారిస్తున్నట్లు సమాచారం. ఈ విషయమై తహసీల్దారును వివరణ కోరేందుకు ప్రయత్నించగా, ఆయన అందుబాటులో లేరు

ఎస్ఐ పల్లెనిద్ర

● శాంతిభద్రతలపై గ్రామస్థులతో చర్చలు



గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎస్ఐ నరేష్‌కుమార్ యాదవ్

విడవలూరు, అక్టోబరు 2: విడవలూరు ఎస్ఐ నరేష్ కుమార్ యాదవ్ పల్లెబాట పట్టారు. మండలాల్లో అసాంఘిక కార్యకలాపాలు జరగ కూడదన్న రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఆయన బుధవారం అలగాని పాడు గ్రామంలోని ప్రాథమిక పాఠశా లలో పల్లెనిద్ర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. శాంతిభద్రతలపై గ్రామ సర్పంచు శీలు శేషయ్య, టీడీపీ నాయకులు కొపర్తి హరనాథ్, వంగర సురేష్, పొనుగోటి నారాయణ, గ్రామస్థులతో చర్చించారు. గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తులు తిరుగుతుంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. రాత్రివేళ అప్రమత్తంగా ఉండాలన్నారు. దొంగతనాలు, దోపిడీలు జరగకుండా ఉండాలంటే ప్రజల సహకారం ఎంతో అవసరమన్నారు. పోలీసులు ప్రజల సంరక్షణ కోసమే ఉన్నారన్న విషయాన్ని మరిచిపోవద్దని ఆయన తెలిపారు.

రూ.20 కోట్లతో వేణుగోపాలస్వామి
ఆలయ పునర్నిర్మాణం

- సోమశిల ఆలయానికి రూ.9.50 కోట్లు
- ఆర్‌జేసీ చంద్రశేఖర్ పరిశీలన

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 2 : నెల్లూరు మూలాపేటలోని ప్రసిద్ధ వేణుగోపాల స్వామి ఆలయాన్ని రూ.20కోట్లతో పునర్నిర్మించనున్నారు. జిల్లాలో ఆలయాల పునఃనిర్మాణ పనులు చేపట్టేందుకు రాష్ట్ర దేవదాయ ధర్మదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదేశాల మేరకు ఆ శాఖ తిరుపతి ప్రాంతీయ సంయుక్త కమిషనర్(ఆర్‌జేసీ) చంద్రశేఖర్ ఆజాద్ బుధవారం జిల్లాలో పర్యటించారు. ముందుగా రాజరాజేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేణుగోపాల స్వామి ఆలయాన్ని సందర్శించారు. ఇప్పటికే ఆ ఆలయ పునః నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.20కోట్లు మంజూరు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆలయాన్ని ఆర్‌జేసీ పరిశీలించారు. ఈ కార్యక్రమాల్లో దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ కోవూరు జనార్ధన్‌రెడ్డి, ఆయా ఆలయాల ఈవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం సీసాల పట్టివేత

అనంతసాగరం : స్థానిక బస్టాండ్ సెంటర్‌లో పోలీసులు 50 మద్యం సీసాలను బుధవారం పట్టుకున్నారు. ఎస్ఐ సంతోష్‌రెడ్డి మాట్లాడుతూ గాంధీ జయంతి సందర్భంగా మద్యం దుకాణాలు మూతపడడంతో వైన్ షాపుల నుంచి సేకరించిన 50 సీసాలను మహేష్ అనే వ్యక్తి తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేశామని తెలిపారు.

గాంధీజీ జీవితం నేటితరానికి ఆదర్శం



కావలిటౌన్: గాంధీ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తటవర్తి రమేష్ తదితరులు



వింజమూరు : టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు

కావలిటౌన్, అక్టోబరు 2: పట్టణంలో బుధవారం గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ట్రంకురోడ్డులోని గాంధీ విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. విగ్రహ కమిటీ బాధ్యులు తిరివీధి ప్రసాద్ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు తటవర్తి రమేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు. రెడ్‌క్రాస్ భవనంలోని గాంధీ విగ్రహానికి రెడ్‌క్రాస్ కన్వీనర్ డాక్టర్ బెజవాడ రవికుమార్, ఛైర్మన్ రవి ప్రకాష్, మున్సిపల్ కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్, డీఈ సాయిరాం తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అలాగే కాంగ్రెస్, వైసీపీ, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు కూడా నివాళులర్పించారు.

●**కందుకూరు:** స్థానిక పొట్టిశ్రీరాములు బజారులో ఉన్న గాంధీ విగ్ర హానికి మున్సిపల్ కమిషనర్ కే అనూష పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో టీడీపీ నాయకులు గాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే ఇంటూరి క్లాస్‌మేట్స్ ఆధ్వర్యంలో పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. పారిశుధ్య కార్మికులకు కమిషనర్ అనూష శాలువాల కప్పి సన్మానించారు. అలాగే అల్లూరు, కొండాపురం, బోగోలు, బిట్రగుంట మండలాల్లో కూడా గాంధీ జయంతి వేడుకలు జరిగాయి.



ఆత్మకూరు: : ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో గాంధీజీకి నివాళులర్పిస్తున్న ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, అధికారులు



లింగపాలెంలో పూలమాలకు నోచని గాంధీజీ విగ్రహం

●**ఆత్మకూరు:** నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో బుధవారం గాంధీ జయంతిని నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీడీవో పి ఐజాక్ ప్రవీణ్, తహసీల్దారు కార్యాలయ ఆవరణలో టీడీపీ పట్టణాధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, తెలుగు యువత జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు పిడికిటి వెంకటేశ్వర్లునాయుడు, రూరల్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుంకర పెంచలచౌదరి, కేతా విజయభాస్కర్‌రెడ్డి గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపల్ కార్యాలయంలో ఛైర్‌పర్సన్ జి వెంకటరమణమ్మ, వైస్‌ఛైర్మన్ షేక్ సర్దార్, వైసీపీ, కాంగ్రెస్ కార్యాలయాల లో, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గాంధీజీ జయంతి వేడుకలను నిర్వహించారు. సత్రం సెంటర్‌లోని గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

●**ఉదయగిరి రూరల్:** స్థానిక తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు సుభద్ర, వీఆర్వోలు, మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాసరావు, సిబ్బంది, పోలీస్‌స్టేషన్‌లో సీఐ వెంకటరావు, ఎస్‌ఐ శ్రీనివాసులు, ఎంఈవో కార్యాలయంలో ఎంఈవో షేక్ మస్తాన్‌వలి, ఎంజీఆర్ ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలో అసోసియేట్ డీన్ డాక్టర్ కృష్ణారెడ్డి, ప్రొఫెసర్లు గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

స్వచ్ఛతా హీ సేవ ర్యాలీ

గాంధీ జయంతి సందర్భంగా స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు కళాశాల వద్ద నుంచి పంచాయతీ బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ చేపట్టారు. పోలీస్‌స్టేషన్, పంచాయతీ బస్టాండ్, శివాలయం, మార్కెట్ తదితర ప్రాంతాల్లో ప్లాస్టిక్, చెత్తా చెదారాలను తొలగించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ శ్రీనివాసులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ అధికారి వెంకటసుబ్బయ్య, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

●**దుత్తలూరులో:** దుత్తలూరు-1 సచివాలయంలో గాంధీ చిత్రపటానికి టీడీపీ నాయకులు, ఉద్యోగులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి యనమల సుబ్బమ్మ, ఎంపీటీసీ వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు కాకర్ల మధు, చీదర్ల మల్లికార్జున, సుబ్బారెడ్డి, చిన్నపరెడ్డి, అంజిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

●**నర్రవాడలో:** మండలంలోని నర్రవాడలో బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం మహాత్మాగాంధీ, లాల్‌బహదూర్‌శాస్త్రి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మేకపాటి మాల్యాద్రినాయుడు, చుండి హరిగోపాల్‌రెడ్డి, పసల కృష్ణ, పాల్గొన్నారు.

●**ఏఎస్ పేట:** మండలంలోని తహసీల్దారు, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ పద్మజారెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసులు, పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ సైదులు గాంధీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.

●**మర్రిపాడు:** మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, సచివాలయాలలో గాంధీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

●**సంగం:** గాంధీ జయంతిని పురస్కరించుకుని బుధవారం మండలంలోని పడమటిపాళెం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో స్వచ్ఛతా ర్యాలీ నిర్వహించారు. కాలనీలోని బ్రహ్మంగారి ఆలయ పరిసరాలు శుభ్రం చేశారు. అనంతరం గాంధీజీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాల ఆయా లక్ష్మమ్మను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో జానికీరామ్, మల్లయ్య, ప్రధానోపాధ్యాయులు జయప్రకాష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

మండలంలోని జెండాదిబ్బలో గాంధీ జయంతిని పురస్కరించుకుని తెలుగు యువత ఆధ్వర్యంలో ఎనైల్ హాస్పిటల్ వారిచే ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పాఠశాల ఆవరణలో గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎనైల్ వైద్యశాల డాక్టర్లను తెలుగు యువత నాయకులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎనైల్ వైద్యశాల వైద్యులు డాక్టర్ సామ్రాట్, హరికృష్ణ, జావీద్, టీడీపీ నాయకులు కర్నాటి గుండ్లపల్లి శ్రీనివాసులు యాదవ్, బాణా శ్రీనివాసులురెడ్డి, రవీంద్రరెడ్డి, నరేష్, వేణుబాలు, పవన్ కుమార్, వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

●**అనంతసాగరం:** స్థానిక రాజు కాలనీలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సీనియర్ సిటిజన్లను సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వేము హరిబాబు, ప్రవీణ్, అశోక్, యుగంధర్, కరీముల్లా, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

●**సీతారామపురం:** మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీవో భార్గవి ఆధ్వర్యంలో బుధవారం మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్వచ్ఛ భారత్ ప్రతిజ్ఞ చేశారు. ఈకార్యక్రమంలో ఏవో చంద్రశేఖర్, మాజీ జట్పిటిసి కలివెల జ్యోతి, సీనియర్ అసిస్టెంట్ ఖలీల్, సచివాలయ కార్యదర్శి జీవర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● **వింజమూరు** : స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో సతీమణి కాకర్ల ప్రవీణ, మండల నాయకులతో కలిసి మహాత్మా గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

జీబీకేఆర్ ఎస్టీ కాలనీలో వైద్య శిబిరం

పట్టణంలోని జీబీకేఆర్ ఎస్టీ కాలనీలో డాక్టర్ మాసిలామణి ఆధ్వర్యంలో గాంధీ జయంతిని పురస్కరించుకుని వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో రోగులకు మాసిలామణి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కుమార్తె ప్రీతిక, మాజీ సొసైటీ ఛైర్మన్ జూపల్లి రాజారావు తదితరులు పాల్గొన్నారు.

డ్రైడే రోజున మద్యం, మాంసం విక్రయాలు

వలేటివారిపాలెం : గాంధీ జయంతి రోజున వలేటివారిపాలెలో జోరుగా మద్యం, మాంసం విక్రయాలు జోరుగా కొనసాగాయి. అరికట్టాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. అలాగే మండలంలోని పలు గ్రామాల్లో కూడా బుధవారం యథేచ్ఛగా మాంసం, మద్యం విక్రయాలు కొనసాగాయి. లింగపాలెంలో ఉన్న గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి నవారేలేరు.



ఉదయగిరి రూరల్: తహసీల్దారు కార్యాలయంలో గాంధీజీకి నివాళులర్పిస్తున్న తహసీల్దారు, ఉద్యోగులు



కందుకూరు : నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి స్నేహితులు

శరన్నవరాత్రి ఉత్సవాలకు ఆలయాల ముస్తాబు



ప్రత్యేక అలంకరణలో సంతానలక్ష్మీదేవి

కావలిటౌన్, అక్టోబరు 2: దసరా నవరాత్రోత్సవాలకు పట్టణంలోని ఆలయాల్లో ఏర్పాట్లు సిద్ధమయ్యాయి. గురువారం నుంచి దసరా ఉత్సవాలు ప్రారంభం కానుండడంతో కలుగోళశాంభవి ఆలయాన్ని ముస్తాబు చేశారు. పాతూరులోని విష్ణాలయం, శివాలయం, కొత్తబజారులోని కన్యకాపరమేశ్వరి ఆలయం, వడ్డిపాలెంలోని దుర్గాదేవి ఆలయం, వెంగళరావునగర్‌లోని ఆలయం, బృందావనం కాలనీలోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో నవ రాత్రోత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.

●**కలిగిరి:** మండలంలోని తెల్లపాడులో వెలసి ఉన్న భద్రకాళి అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం నుంచి ఈనెల 12వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త జూపల్లి వెంకటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 3న బాలాత్రిపుర సుందరీదేవి, 4న గాయత్రీదేవి, 5న లలితా త్రిపుర సుందరీదేవి, 6న సరస్వతిదేవి, 7న అన్నపూర్ణాదేవి, 8న మహాలక్ష్మీదేవి, 9న రాజరాజేశ్వరిదేవిగా అమ్మవారు దర్శనమిస్తారని తెలిపారు.10న దుర్గాదేవి, 11న మహిషాసురమర్ధిని, 12న భద్రకాళి అమ్మవారిగా దర్శనమివ్వనున్నట్లు తెలిపారు.

●**ఉదయగిరి రూరల్** శరన్నవరాత్రి ఉత్సవాలకు ఆలయాలు ముస్తాబయ్యాయి. పట్టణంలోని శివాలయంలో దసరా నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు ప్రతిరోజు ప్రత్యేక అలంకారాల్లో భక్తులకు దర్శనమిస్తారని ఆలయ అర్చకులు అనీల్‌శర్మ తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా శివాలయంలోని పార్వతీదేవి 3న బాలత్రిపురసుందరిదేవి, 4న గాయత్రీదేవి, 5, అన్నపూర్ణాదేవి, 6న లలితాత్రిపురసుందరీదేవి, 7న మహాచండీదేవి, 8న మహాలక్ష్మి, 9న సరస్వతీదేవి, 10న దుర్గాదేవి, 11న మహిషాసురమర్దిని, 12న రాజరాజేశ్వరిదేవి అలంకారాల్లో భక్తులకు దర్శనమిస్తారన్నారు. అలాగే బీసీ కాలనీ వద్ద గల సంతానలక్ష్మీదేవి ఆలయం, బ్రాహ్మణవీధిలో రామాలయం, బాలాజీనగర్‌లో ఏర్పాటు చేసే అమ్మవారి వద్ద నవరాత్రి ఉత్సవాలతోపాటు అమ్మవారి ప్రత్యేక అలంకరణలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

●**ఆత్మకూరు:** ఆత్మకూరు పట్టణంలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయం, జ్వాలాముఖి, తిరునాళ్ళతిప్పలోని శ్రీదుర్గామల్లేశ్వరి ఆలయం, శివాలయంలోని అన్నపూర్ణాదేవి ఆలయంలో శరన్నవరాత్రి మహోత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. గురువారం కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు భువనేశ్వరి అలంకరణలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. శివాలయంలోని అన్నపూర్ణాదేవి ఆలయంలో నవరాత్రుల్లో విశేష అలంకరణలతో అమ్మవారు అలరిస్తారని ఆలయ పూజారి శివకుమార్‌శర్మ పేర్కొన్నారు..

ప్రమాదకరంగా స్విచ్‌బోర్డులు



వసతి గృహంలో పగిలిపోయిన స్విచ్‌బోర్డు

లింగసముద్రంలోని ఎస్సీ, బీసీ బాలుర సంక్షేమ వసతి గృహాల్లోని విద్యుత్ స్విచ్ బోర్డులు పగిలిపోయి ప్రమాదకరంగా ఉన్నాయి. దీంతో విద్యార్థులు వాటిని జాగ్రత్తగా ఆన్ చేయాల్సి వస్తోంది. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదానికి గురికాక తప్పదు. కొన్ని గదుల్లో ఫ్యాన్లు కూడా పని చేయడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి రెండు వసతిగృహాల్లోనూ స్విచ్ బోర్డులు, ఫ్యాన్లు మరమ్మతులు చేయాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు. **- లింగసముద్రం**

మలుపులోని చెట్లు.. ప్రమాదానికి మెట్లు !



కలిగిరి రహదారిలో ప్రమాదకరంగా ఉన్న మలుపు

మండలంలోని కలిగిరి రహదారిలో ఆశ్రమం మలుపులో పెరిగిన చెట్లు ప్రమాదాలకు నెలవుగా మారాయి. సంగం పాత చెక్‌పోస్టు నుంచి 1.5 కిలో మీటర్ల దూరంలో ప్రమాదకరంగా మలుపు ఉంది. ఈ మలుపులో ఏపుగా చెట్లు పెరిగి ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆదివారం రాత్రి ఎదురెదురుగా వస్తున్న మోటారు బైక్, ఆర్టీసీ బస్సు ఢీకొని ఓవ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. ఆర్‌అండ్‌బి అధికారులు స్పందించి మలుపులో పెరిగిన చెట్లను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు. **- సంగం**

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

బారికేడ్ల ఏర్పాటు



గౌరవరం దాబా హోటళ్ల వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లు

కావలి రూరల్, అక్టోబరు 2: జాతీయ రహదారిపై ప్రమాదాల నియంత్రణకు బారికేడ్లు ఏర్పాటు చేశామని రూరల్ సీఐ జీ రాజేశ్వరరావు తెలిపారు. మండలంలో ప్రమాదాలు ఎక్కువగా జరిగే మద్దూరుపాడు, గౌరవరం ప్రాంతాల్లోని జాతీయ రహదారిపై బుధవారం జిగ్ జాగ్ గా బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి, వాహనాల వేగ నియంత్రణకు బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టోల్‌గేట్ మేనేజర్ గణేష్, రూరల్ ఎస్‌ఐ తిరుమల రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ

సంగం, అక్టోబరు 2: మండలంలోని దువ్వూరులో జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఐదు నిరుపేద కుటుంబాలకు బుధవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన ఎన్‌ఆర్‌ఐ చదలవాడ హరీష్ రావు, నరదాసు రవి, తోకల శ్రీధర్ సహకారంతో నెల రోజులకు సరిపడ బియ్యం, పప్పులు, నూనె వంటి నిత్యవసర సరుకుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన ఆత్మకూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నలిశెట్టి శ్రీధర్, దాడి భాను కిరణ్, పలువురు జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటి నుంచి పాఠశాలలకు దసరా సెలవులు

సంగం, అక్టోబరు 2: మండలంలోని పాఠశాలలు, బాలికల గురుకుల పాఠశాలలకు ప్రభుత్వం 3వ తేదీ నుంచి 13 వరకు దసరా సెలవులు ప్రకటించింది. ఈమేరకు స్థానిక డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలల్లో విద్యార్థినులను వారి తల్లిదండ్రులు తీసుకెళ్లారు. అదేవిధంగా హాస్టల్ విద్యార్థులు వారి వారి లగేజీలు తీసుకుని బయలుదేరారు.

పారిశుధ్యం మెరుగుపర్చాలి

లింగసముద్రం, అక్టోబరు 2 : గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో కట్టా శ్రీనివాసులు కోరారు. బుధవారం మండలంలోని చినపవని సచివాలయంలో స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా గ్రామసభ నిర్వహించారు.ఈ సందర్భంగా గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ కేవీ రామ సుబ్బారావు, సర్పంచు దామా సీతారామయ్య, టీడీపీ నాయకుడు సోంపల్లి మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం

బిట్రగుంట, అక్టోబరు 2: మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని ఎస్సై భోజ్యా అన్నారు. బోగోలు పాతదళితవాడ శ్మశానవాటికలో బుధవారం ఆయన మొక్కలు నాటారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ వైద్యులు పర్రి విజయేంద్ర, పాస్టర్ శ్యాంసన్‌బాబు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో స్థానికులు పులి ప్రసాద్, సనగిరి వెంకట్రావ్, సూదల గోపి, బుర్రి వెంకటరావు, మన్నెం శ్రీనివాసులు, సూర్యనారాయణమ్మ, కే.రమణమ్మ, పాల్గొన్నారు.

'ప్రకాశం'లో ఘనంగా ఫ్రెషర్స్‌డే

కందుకూరు, అక్టోబరు 2: ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీలో బుధవారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ యాజమాన్యం, అధ్యాపకులు, సిబ్బంది ప్రణాళికాబద్ధంగా చేస్తున్న కార్యచరణ వల్లనే తమ కళాశాల రాష్ట్రస్థాయిలో పేరుగాంచిందన్నారు. ఈసందర్భంగా కళాశాల అధ్యాపక బృందం కరస్పాండెంట్ కంచర్ల రామయ్యను ఘనంగా సన్మానించారు. అనంతరం విద్యార్థులు సాంప్రదాయ, సినిమా పాటలకు నృత్యం చేసి అలరించారు.

రాష్ట్రస్థాయి క్రీడలకు విద్యార్థుల ఎంపిక

బిట్రగుంట, అక్టోబరు 2: బోగోలు హోలీఫ్యామిలీ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికయినందుకు బుధవారం హెచ్‌ఎం సిస్టర్ గీతాకుమారి పుష్పగుచ్ఛాలతో వారిని అభినందించారు. నెల్లూరులో జరిగిన జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-14 విభాగంలో ఫుట్‌బాల్, జిమ్నాస్టిక్స్‌కు పీట్ల సుమత్, ఖోఖోకు పీట్ల ప్రణిత ఎంపికైనట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకులు సిస్టర్ ఆంటోనెట్, పీఈటీ స్టీవెన్‌మార్క్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ఆస్తుల పరిరక్షణ అందరి బాధ్యత

కావలి రూరల్, అక్టోబరు 2: రైల్వే ఆస్తుల పరిరక్షణ బాధ్యత అందరిదీ అని ఆర్‌పీఎఫ్ ఎస్‌ఐ సుబ్బారావు పేర్కొన్నారు. స్థానిక ఆర్‌పీఎఫ్ పోలీస్ స్టేషన్‌లో గాంధీ జయంతి సందర్భంగా బుధవారం ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు, చైతన్య డిగ్రీ కళాశాల విద్యార్థులకు స్వచ్ఛభారత్, రైల్వే ఆస్తుల పరిరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమం లో ఆర్‌పీఎఫ్ సిబ్బంది, విద్యార్థులు తదతరులు పాల్గొన్నారు.

'చాకిరీమాన్యం భూములపై అవగాహనతో మాట్లాడాలి'

బిట్రగుంట, అక్టోబరు 2: చాకిరీమాన్యం, దేవదాయ మాన్యం- భూములపై పూర్తి అవగాహనతో మాట్లాడాలని మాజీ ఎంపీటీసీ చిలకపాటి వెంకటేశ్వర్లు అన్నారు. బోగోలు టీడీపీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ గంగమ్మ, పోలేరమ్మ మాన్యం భూములపై వైసీపీ నేత చేసిన వ్యాఖ్యలను ఖండించారు. ఎండోమెంట్ భూముల ధ్రువీకరణ పత్రాలు ఆ శాఖ కార్యాలయంలో ఉంటాయని పేర్కొన్నారు. వెట్టిచాకిరీ నిర్మూలన కింద 40 ఏళ్ల క్రితం సాగు చేసుకునే వారికి ప్రభుత్వం పట్టాలు మంజూరు చేసిందని తెలిపారు. పెద్దగొల్ల, పెద్దకాపు, కుమ్మరి, కంసాలి, మంగళి, చాకలి, వెట్టి మాన్యాలు చేసుకునే వారికి పూర్తి హక్కులు కల్పించారని తెలిపారు. తాతల కాలంనుంచి వారసత్వంగా సంక్రమించిన భూమికి 25 ఏళ్ల క్రితమే పట్టాపాసుపుస్తకాలు వచ్చాయని అన్నారు. ఇవన్నీ తెలుసుకుని ఆ నేత మాట్లాడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జీ.నాగరాజు, అర్వత్‌రాజ్, అరుణమ్మ, ఎస్ఎస్ యాదవ్, ప్రభాకర్, సంజయ్, పీ.రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అనంతసాగరం, అక్టోబరు 2: సోమశిల సబ్‌స్టేషన్ పరిధిలో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఆశాఖ ఏఈ మురళీకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మతులు కారణంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కోత ఉంటుందని, ప్రజలు గమనించాలని కోరారు.

ఆసుపత్రికి వెళ్లి పింఛన్ అందజేత

కావలి, అక్టోబరు 2: పట్టణంలోని 10 వవార్డుకు చెందిన బొడ్డు చెంచమ్మ వెన్నుపూస ఆపరేషన్‌తో నెల్లూరు నారాయణ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి ఆదేశానుసారం ఆ వార్డు టీడీపీ నాయకుడు వల్లేరి వెంకటకిరణ్, వార్డు సచివాలయ సిబ్బంది నవీన్, ఏఎన్ఎం సుధాను తీసుకుని బుధవారం నెల్లూరు వెళ్లి చెంచమ్మకు రూ.4,000 పింఛన్‌ను అందచేశారు.

వరికుంటపాడు : క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ శస్త్రచికిత్స చేయించుకొని నెల్లూరులోని వైద్యశాలలో ఉన్న ఓ మహిళకు బుధవారం రామాపురం వెల్ఫేర్ అసిస్టెంట్ కొండపనాయుడు పింఛన్ నగదు అందజేశారు. కాకొల్లువారిపల్లి గ్రామానికి చెందిన ఆమె నివాసంలో లేకపోవడంతో విషయం తెలుసుకున్న ఆయన నెల్లూరుకు చేరుకొని అక్కడ ఆమెకు పింఛన్ నగదు అందించారు.

రక్తదాతలు స్ఫూర్తి ప్రదాతలు

● మున్సిపల్ వైస్ ఛైర్మన్ డాక్టర్ శ్రావణ్‌కుమార్



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ శ్రావణ్‌కుమార్

ఆత్మకూరు, అక్టోబరు 2: రక్తదాతలు స్ఫూర్తిప్రదాతలుగా నిలిచి పలువురికి ప్రాణదానం చేస్తున్నారని అభిరామ్ హాస్పిటల్ ఎండీ, మున్సిపల్ వైస్ ఛైర్మన్ డాక్టర్ కేవీ శ్రావణ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక అభిరామ్ మల్టీస్పెషాలిటీ వైద్యశాలలో గాంధీజయంతి సందర్భంగా స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది గాంధీ జయంతి రోజు అభిరామ్ హాస్పిటల్ నేతృత్వంలో నిర్వహించిన రక్తదాన శిబిరం కొంతమందికి ప్రాణదానం చేస్తోందన్నారు. ప్రస్తుతం 19వ సారి ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరంలో పలువురు రక్తదానం చేశారన్నారు. రక్తదాన శిబిరానికి స్వచ్ఛందంగా తరలి వచ్చిన యువతకు ధన్యవాదాలు తెలిపారు. ముందుగా గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మేకపాటి దీప్తి, వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనుల ఎంపికకు గ్రామసభలు

వరికుంటపాడు, అక్టోబరు 2: మండలంలోని పెద్దిరెడ్డిపల్లి, వరికుంటపాడు సచివాలయాల్లో బుధవారం ఈవోపీఆర్డీ సికిందర్ ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకం పనుల ఎంపికకు గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పనులను గుర్తించామని, ప్రభుత్వ అనుమతి మేరకు ప్రణాళికాబద్ధంగా పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. అనంతరం గాంధీజీ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అరవ మహేష్, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి పోలుబోయిన శ్రీకాంత్, యూనిట్, బూత్ ఇన్‌చార్జిలు నాదిండ్ల రాజేంద్ర, పొద మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

సబ్‌జైలులో న్యాయ విజ్ఞాన సదస్సు



కోర్టు ప్రాంగణంలో శుభ్రం చేస్తున్న న్యాయాధికారులు

కావలిటౌన్, అక్టోబరు 2: గాంధీ జయంతి సందర్భంగా మండల లోక్ అదాలత్ ఆధ్వర్యంలో బుధవారం సబ్‌జైల్‌లో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. అడిషినల్ జ్యూడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ జీ విక్రమ్‌సిన్హా ముఖ్య అతిథిగా పాల్గొని గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఖైదీలకు చట్టాల గురించి వివరించి, పండ్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో జైల్ సూపరింటెండెంట్ చిన్న సుబ్బయ్య, లీగల్ ఎయిడ్ మెంబర్ సాయిప్రసాద్, లోక్ అదాలత్ మెంబర్ మాలకొండారెడ్డి, న్యాయవాది కెనడి పాల్గొన్నారు. అనంతరం సివిల్ జడ్జి ఈ సుధాకర్, ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ విక్రమ్‌సిన్హా, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సురేంద్రరెడ్డి, ప్రకాష్ కోర్టు ప్రాంగణంలో పరి సరాలను శుభ్రం చేశారు.

సంపూర్ణ ఆరోగ్యానికి శాకాహారం ఉపయుక్తం

ఆత్మకూరు, అక్టోబరు 2: పట్టణంలోని షిరిడీసాయి పిరమిడ్ కేంద్రం నిర్వాహకులు డాక్టర్ చంద్రా సుబ్రహ్మణ్యం దంపతుల ఆధ్వర్యంలో బుధవారం మహాకరుణ- మెగా శాకాహార ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటుచేసిన బహిరంగ సభలో హిమాలయ యోగి కట్టా కళాధర్‌రెడ్డి, పీఎస్ఎస్ఎం జిల్లా అధ్యక్షుడు, న్యావాది జె శ్రీనివాస్, పలువురు సీనియర్ పిరమిడ్ మాస్టర్లు మాట్లాడుతూ సంపూర్ణ ఆరోగ్యానికి శాఖాహారం ఉపయుక్తమని తెలిపారు. ఈకార్యక్రమంలో ఆత్మకూరు, వింజమూరు, సంగం, బుచ్చిరెడ్డిపాళెం, నాయుడుపేట, గూడూరు, నెల్లూరు తదితర ప్రాంతాలకు చెందిన పిరమిడ్ మాస్టర్లు, ధ్యానసాధకులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించొద్దు



ఆటోడ్రైవర్లకు సూచనలిస్తున్న సీఐ వెంకటరావు

ఉదయగిరి రూరల్, అక్టోబరు 2: ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ఆటోలు నడుపుకోవాలని సీఐ ఎన్ వెంకటరావు, ఎస్‌ఐ శ్రీనివాసులు ఆటో డ్రైవర్లకు సూచించారు. బుధవారం స్థానిక సర్కిల్ కార్యాలయ ఆవర ణలో ఆటో డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బస్టాండ్ ప్రాంతంలో రోడ్లపై ఆటోలను నిలిపి ట్రాఫిక్‌తోపాటు ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్నారని ఫిర్యాదులు వస్తున్నాయని, అలా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. డ్రైవరుకు ఇరువైపులా ప్రయాణికులను కూర్చోబెట్టుకున్నా, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించినా కఠిన చర్యలుంటా యన్నారు. డ్రైవింగ్ లైసెన్సుతోపాటు వాహనాలకు సంబంధించిన పత్రాలను సక్రమంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ గ్రామాన ఎమ్మార్పీఎస్ జెండా ఎగరాలి

కావలి, అక్టోబరు 2: జిల్లాలోని గ్రామ గ్రామాన ఎమ్మార్పీఎస్ జెండాను ఎగుర వేసేందుకు ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ, ఎంఈఎఫ్‌లు సిద్ధం కావాలని ఎంఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి భిక్షాలు మాదిగ పిలుపునిచ్చారు. స్థానిక వైకుంఠపురం సెంటర్‌లో బుధవారం ఎమ్మెస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు ఏ ఏసుమాదిగ, సీహెచ్ వరప్రసాద్ మాదిగల ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ జరిగింది. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్, ఎమ్మెస్పీల నాయకులు సూరిపాక ఉదయక్రిష్ణ మాదిగ, కొపర్తి కొండయ్య మాదిగ, పందిటి అంబేడ్కర్ మాదిగ, గోచిపాతల వెంకటేశ్వర్లు, జీ కొండయ్య, జానకి, చేవూరి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రవాగుపై బ్రిడ్జి నిర్మించాలని ఆందోళన



ఎర్రవాగు వద్ద రహదారిపై నిరసన చేస్తున్న గ్రామస్థులు

కందుకూరు, అక్టోబరు 2: సింగరాయకొండ నుంచి పామూరు వరకు చేపట్టిన జాతీయ రహదారిపై కొండముడుచు గ్రామం వద్ద ఎర్రవాగుపై అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మించాలని ఆప్రాంత ప్రజలు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. కొత్త హైవే నిర్మాణంతో ట్రాఫిక్ సమస్యలు పెరిగిపోతాయని, పైగా కావలి, పెద్దపవని, లింగసముద్రం, గుడ్లూరు గ్రామాల ప్రజలు నిత్యం కందుకూరుకు రాకపోకలు సాగిస్తుంటారు. అలాంటప్పుడు జాతీయ రహదారిని దాటే క్రమంలో ప్రమాదాలు జరుగుతుంటాయని, ఈ సమస్యకు పరిష్కారం చూపించి రోడ్డునిర్మాణ పనులు చేపట్టాలని సంబంధిత కాంట్రాక్టర్‌కి, హైవే అథారిటీకి వినతి పత్రాలు అందచేసినట్లు గ్రామ స్థులు తెలిపారు. ప్రయోజనం లేకపోవడంతో జాతీయ రహదారి పనులు అడ్డుకొని ధర్నా చేపట్టారు. దీంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. సమాచారం అందుకున్న సబ్ కలెక్టర్ శ్రీపూజ అక్కడికి చేరుకొని నిరసనకారులతో చర్చలు జరిపారు. అయినా నిరసనకారులు తమ ఆందోళన విరమించలేదు.

నెల్లూరు సిటీ, రూరల్
కోవూరు, సర్వేపల్లి



కలెక్టరేట్‌లో గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జేసీ కార్తిక్



పోలీసు కార్యాలయంలో బాపూజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

గాంధీజీ జీవితం అందరికీ ఆదర్శం

● ఎస్పీ కృష్ణకాంత్ ● ఘనంగా బాపూజీ, శాస్త్రీజీ జయంతి

నెల్లూరు (క్రైం/విద్య/వైద్యం), అక్టోబరు 2 : గాంధీ మహాత్ముని జీవితం అందరికీ ఆదర్శ ప్రాయమని, ఆయన అడుగు జాడల్లో అందరూ నడవాలని ఎస్పీ జీ కృష్ణకాంత్ పిలుపునిచ్చారు. జాతిపిత మహాత్మా గాంధీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతిని బుధవారం నగరంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీతోపాటు పలువురు అధికారులు బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్‌ఐ రాజారావు, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ బీ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

● జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో గాంధీజీ, శాస్త్రీజీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీఈవో రామారావు మాట్లాడుతూ స్వాతంత్య్రం కోసం బాపూజీ అనుసరిం చిన మార్గాల్లోనే అందరూ నడవాలన్నారు. అహింస ద్వారా మాత్రమే ఎంతటి కార్యమైనా సిద్ధిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న జనసేన నాయకులు

● డీకే ప్రభుత్వ మహిళా కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ గిరి గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థినులు ఆలపించిన దేశభక్తి గీతాలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థినులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమ తులు అందించారు. అధ్యాపకులు డాక్టర్ శ్రావణ్‌కుమార్, డాక్టర్ వీ చెంచురామయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

● మాగుంట లేఅవుట్‌లోని విశ్వసాయి జూనియర్ కళాశాలలో గాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి జయంతిని నిర్వహించారు. కళాశాల చైర్మన్ డాక్టర్ ఎస్ సత్యనారాయణ, డైరెక్టర్ జీ కృష్ణమోహన్ మాట్లాడుతూ గాంధేయ వాదమే సరైనదన్నారు.

● ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గాంధీ, లాల్‌బహదూర్‌శాస్త్రి జయంతి వేడుకలు నిర్వహించారు. బిరదవోలు రామ్మోహన్‌రెడ్డి, షేక్ నసీర్‌అహ్మద్, సుబ్బరాయుడు, నలుబోలు బలరామయ్యనాయుడు పాల్గొన్నారు.

● ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో మహాత్మాగాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు వైద్యాధికారులు నివాళులర్పించారు. ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ గంగాధర్, ప్రభుత్వ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నరేంద్ర, జీజీహెచ్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ కళారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

● జనసేన పార్టీ ఆధ్వర్యంలో గాంధీ బొమ్మ సెంటర్‌లోని గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ కోర్ కమిటీ సభ్యుడు నూనె మల్లికార్జున యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ సుందరరామిరెడ్డి, లాయర్ శ్రీరామ్, కృష్ణారెడ్డి, రవి, గుర్రం కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

● కోటమిట్ట పీహెచ్‌సీలో పరిశుభ్రమైన భారత దేశం కార్యక్రమాన్ని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్‌సింగ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పరిసరాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా బీజేపీ ఇన్‌చార్జి కొక్కెర శ్రీనివాస్ యాదవ్, నాయకులు పెంచ లయ్య, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

సైదాపురం: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్ ఆధ్వర్యంలో బుధవారం మహాత్మాగాంధీ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్మగాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో పిచ్చిమొక్కలు తొలగించారు. కార్యక్రమంలో వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

నెల్లూరును స్వచ్ఛంగా ఉంచుదాం

● మేయర్, కమిషనర్



నెల్లూరు రూరల్ : నెల్లూరు నగర పాలక సంస్థ కార్యాలయంలో మేయర్ పోట్లూరి స్రవంతి, కమిషనర్ ఎం సూర్యతేజ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వచ్ఛభారత్ కార్యక్రమ స్ఫూర్తితో నెల్లూరు నగరాన్ని స్వచ్ఛంగా ఉంచేందుకు ప్రజలంతా సహకరించాలని కోరారు. స్వచ్ఛ సర్వేక్షన్ అభియాన్ కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. అలాగే, ఎంపీడీవో, తహసీల్దారు కార్యాలయాలు, పోలీసుస్టేషన్లలో గాంధీ జయంతి నిర్వహించారు. పాతవెల్లంటిలోని సచివాలయంలో గాంధీజీకి నివాళులర్పించారు.



కోవూరు : గాంధీజీకి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు



వెంకటాచలం : బాపూజీకి నివాళులర్పిస్తున్న వీఎస్‌యూ అధికారులు, తదితరులు

వెంకటాచలం: గాంధీజీ జీవిత విధానం స్ఫూర్తిదాయకమని యూనివర్శిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ సీఎస్ సాయిప్రసాద్‌రెడ్డి కొనియాడారు. మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న విక్రమ సింహపురి యూనివర్శిటీలో బుధవారం గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వర్శిటీ ప్రాంగణంలో ఉన్న మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వర్శిటీ కళాశాల పీడీ డాక్టర్ ఏ.ప్రవీణ్‌కుమార్, డాక్టర్ ఎస్‌వో గోపాల్, డాక్టర్ శ్యాంసుందర్‌భగవాన్, పాల్గొన్నారు.

కోవూరు : స్థానిక శివాలయం సమీపంలోని గాంధీజీ విగ్రహానికి టీడీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నెల్లూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, నాయకులు పంతంగి రామారావు, కలికి సత్యనారాయణ రెడ్డి, ఇందుపూరు మురళీకృష్ణారెడ్డి, గొర్రిపాటి నరసింహ పాల్గొన్నారు.



బుచ్చిలో పారిశుధ్య కార్మికులకు సత్కారం

బుచ్చిరెడ్డిపాళెం : బుచ్చిరెడ్డిపాళెంలోని ముంబై జాతీయ రహదారిపై ఉన్న మహాత్మా గాంధీ విగ్రహానికి బీజేపీ నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఆటోనగర్ ప్రాంతంలో రోడ్డు శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పల్నాడు జిల్లా ఇన్‌చార్జి కొక్కెర శ్రీనివాస్, బీజేపీ నగర పంచాయతీ అధ్యక్షుడు రామిశెట్టి మోహన్‌బాబు, ఎంపీటీసీ వినయ్‌నారాయణ, నాయకులు కాసా శ్రీనివాసులు, ఇనుగూరు బాలయ్య, ఆలూరు నాగవేణి, రామకృష్ణ పాల్గొన్నారు. తహసీల్దారు, ఎంపీడీవో, పోలీస్ స్టేషన్, వెలుగు కార్యాలయాలతోపాటు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలు, హాస్టళ్లలో గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దారు అంబటి వెంకటేశ్వర్లు, ఎంపీడీవో నరసింహరావు, సీఐ శ్రీనివాసులురెడ్డి, ఎస్‌ఐ సంతోష్‌రెడ్డి, వెలుగు ఏపీఎం, వీవోఏలు పాల్గొన్నారు.

● నగర పంచాయతీలోని పారిశుధ్య కార్మికులను కమిషనర్ లింగారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. అనంతరం ప్రభుత్వ కార్యాలయాల్లో శుభ్రం చేసి బహిరంగ ప్రదేశాల్లో మొక్కలు నాటారు.

పొదలకూరు : స్థానిక పంచాయతీ బస్టాండు ఆవరణలో ఆర్యవైశ్య నాయకులు గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు అమర్తలూరు చెంచయ్య, పొట్టి సుధాకర్, మీరా మధు, రాచపూటి ధనుంజయరావు, విజయ్‌కుమార్, ప్రభాకర్, మణిస్వామి, సురేష్‌బాబు పాల్గొన్నారు. అలాగే తహసీల్దారు కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి డిప్యూటీ తహసీల్దారు సురేఖ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌వోలు శ్రీహరి, శంకరయ్య, పోలిరెడ్డి, హరి, రామయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విడవలూరు : స్థానిక తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు చంద్రశేఖర్, మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీవో దశరథరామిరెడ్డిలు గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

తోటపల్లిగూడూరు : మండలంలోని కొత్తపాలెంలో సర్పంచు చేవూరు పద్మావతి, గురు కుల పాఠశాలలో ప్రిన్సిపాల్ ఎస్తేరమ్మ, తహసీల్దారు కార్యాలయంలో పద్మజ, వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్య క్రమాల్లో మాజీ సర్పంచు చేవూరు శ్రీనివాసులు, ఉపసర్పంచు శ్రీహరి, పొట్లూరు మస్తా నయ్య, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మనుబోలు : స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఉప తహసీల్దారు బషీర్, రెవెన్యూ అధికారులు గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వీఆర్‌వోలు నాగార్జునరెడ్డి, మురళీధర్, భగవాన్, అఖిల్, శ్రీనువాసులు పాల్గొన్నారు.

దేవి నవరాత్రుల్లో నేడు

● తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో రంగనాయకమ్మకు ఉదయం 9గంటలకు తిరుమంజనం, రాత్రి ప్రాకారోత్సవం. ● స్టోన్‌హౌస్‌పేట వాసవీ కన్యకాపరమేశ్వరి ఆల యంలో ఉదయం 6.30గంటలకు కలశ స్థాపన, ప్రాణ ప్రతిష్ఠ, పెన్నానది నుంచి జలాల సేకరణ, రాత్రి భవానీ అలంకారం. ● రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో ఉదయం 8.34గంటలకు కలశ ప్రతిష్ఠ, చండీ అలంకారం. ● మూలస్థానేశ్వ రాలయంలో సాయంత్రం 5.30గంటలకు కలశస్థాపన, భవానీ అలంకారం ● వీర బ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఉదయం 7గంటలకు అభిషేకాలు, రాత్రి దుర్గాదేవి అలంకారం ● శ్రీకృష్ణధర్మరాజులస్వామి ఆలయాల్లో సాయంత్రం 6.30గంటలకు కలశ స్థాపన

- నెల్లూరు (సాంస్కృతికం)

సముద్ర తీరంలో పరిసరాల శుభ్రత

ముత్తుకూరు, అక్టోబరు 2 : విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం విభాగం ఆధ్వర్యంలో గాంధీ జయంతిని పురస్కరించుకుని బుధవారం కృష్ణపట్నం బీచ్‌లో స్వచ్ఛ భారత్ దివస్ సముద్ర పరిసరాల శుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథుగా విశ్వ విద్యాలయ ఉపకులపతి ఆచార్య ఎస్.విజయభాస్కరరావు, ఐసీజీఎస్ కృష్ణపట్నం కమాండింగ్ ఆఫీసర్ తమిళ్‌సెల్వి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ ఉదయ్ శంకర్, డాక్టర్ ఎస్‌బీ సాయినాథ్, డాక్టర్ బీవీ సుబ్బారెడ్డి, డాక్టర్ సుజయ్, డాక్టర్ గోపీకృష్ణ, ఎస్ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ సంస్థ ప్రతినిధులు, ఎన్ఎస్ఎస్ సిబ్బంది వెంకట్, దొరబాబు పాల్గొన్నారు.

పొదలకూరు సర్కిల్ పరిధిలో 17 మద్యం దుకాణాలు

పొదలకూరు, అక్టోబరు 2 : జిల్లా కలెక్టర్ ఆదేశాలు మేరకు పొదలకూరు సర్కిల్ పరిధిలో 17 మద్యం షాపులకు గెజిట్ విడుదల చేశామని, వీటికి సంబంధించిన దరఖాస్తులను ఈనెల 1 నుంచి 9వ తేదీ వరకు జిల్లాలోని అన్ని ఎక్సైజ్ స్టేషన్‌లో తీసుకుంటారని పొదలకూరు ఎక్సైజ్ సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ప్రతి షాపునకు రూ.2లక్షలు డిపాజిట్ చేయాలని, ఇది రీఫండ్ కాదన్నారు. దరఖాస్తుల పరిశీలన అనంతరం ఈనెల 11వ తేదీన నెల్లూరులోని కస్తూర్బా కళాక్షేత్రంలో లాటరీ తీసి షాపులు కేటాయిస్తామన్నారు. సర్కిల్ పరిధిలోని 17 షాపుల్లో పొదలకూరు మండలంలో 6, చేజర్లలో 3, సైదాపురంలో 4, రాపూరులో 4 షాపులు ఉంటాయన్నారు. ఈ షాపులు ఎక్కడైనా పెట్టుకోవచ్చన్నారు. ఈ సమావేశంలో ఎస్‌ఐ అంజయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

జనసేన నగర సంకీర్తన

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), అక్టోబరు 2: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా జనసేన నాయకుల ఆధ్వర్యంలో బుధవారం నగర సంకీర్తన కార్యక్రమం నిర్వహించారు. గీతా వైభవ్ ట్రస్ట్ చైర్మన్ నజీర్ బాషా మద్దతు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నూనె మల్లికార్జున యాదవ్, సురేంద్ర, రామిరెడ్డి, గునుకుల కిషోర్, గునుకుల విజయలక్ష్మి పాల్గొన్నారు.

విశ్రాంత ఎస్‌ఐ రాంబాబుకు సత్కారం



ఉద్యోగ విరమణ పొందిన ఎస్‌ఐని సత్కరిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు (క్రైం), అక్టోబరు 2: పోలీసు కంట్రోల్ రూమ్ ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తూ ఇటీవలే ఉద్యోగ విరమణ పొందిన ఎం రాంబాబును బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ జీ కృష్ణకాంత్ ఘనంగా సత్కరించారు. ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ తప్పదని, క్రమశిక్షణతో పోలీసుశాఖలో సుదీర్ఘకా లంగా విధులు నిర్వహించడం అభినందనీయ మన్నారు. శేష జీవితం కుటుంబ సభ్యులతో సంతో షంగా గడపాలని ఆకాంక్షిం చారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ రాజారావు, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ బీ శ్రీనివాసరెడ్డి, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దిపాటి ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు 2: మండలంలోని రేబాలకు చెందిన వివాహిత సుప్రియ అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల మేరకు.. రేబాలకు చెందిన వివాహిత గత నెల 20వ తేదీ నుంచి కనిపించకపోవడం కుటుంబ సభ్యులు పలు చోట్ల గాలించారు. అయినా ఆచూకీ తెలియలేదు. దీంతో ఆమె భర్త బద్దిపూడి అశోక్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బీజేపీ ఫాసిస్ట్ విధానాలు విడనాడాలి

● పీసీసీ సభ్యుడు బాలసుధాకర్

నెల్లూరు (వైద్యం): కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఫాసిస్ట్ విధానాలను విడనాడాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సభ్యుడు తలారి బాల సుధాకర్ డిమాండ్ చేశారు. బుధవారం గాంధీ జయంతి సందర్భంగా నగరంలోని డైకాస్ రోడ్డు వద్ద ప్రదర్శన నిర్వహించి గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి వినతిపత్రం అందించారు. పీసీసీ ఉపాధ్యక్షుడు ఉడతా వెంకట్రావ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు సురేష్‌బాబు, షేక్ అల్లాఉద్దీన్, హుస్సేన్‌బాషా, రెహమాన్, హాజీ మొహమ్మద్, హనీఫ్, సయ్యద్ నసీమ, మల్లిఖార్జునరెడ్డి, షేక్ ఇర్ఫాన్, సయ్యద్ రహంతుల్లా తదితరులు పాల్గొన్నారు.



గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

భక్తిశ్రద్ధలతో ఆంజనేయస్వామి జెండాకు పూజలు

మనుబోలు, అక్టోబరు 2 : మనుబోలులో బుధ వారం ఆంజనేయ స్వామి జెండాకు ప్రత్యేకంగా పూజ లు నిర్వహించారు. ప్రతిఏటా మహాలయ అమావాస్య నాడు ఆంజనేయస్వామి జెండాను ఊరేగించి, రావి చెట్టు రచ్చ వద్ద ఉంచి పూజలు చేస్తారు. వర్షం కార ణంగా ఈ దఫా ఉత్సవం చేయలేదు. స్వామికి గజమా లలు వేసి, ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమానికి ఉభయదాతలుగా కుడుముల రాధయ్య గౌడ్, సురేంద్ర గౌడ్ దంపతులు, ధనుష్ గౌడ్ తదితరులు వ్యవహ రించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అం దజేశారు.

నగరంలో 'స్వచ్ఛ' కార్యక్రమాలు



డీకే కళాశాల ఎదుట ర్యాలీకి సిద్ధంగా ఉన్న విద్యార్థినులు

నెల్లూరు (విద్య), అక్టోబరు 2 : డీకే ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో బుధవారం స్వచ్ఛతా హీ సేవ, స్వచ్ఛభారత్ దివస్ కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థినులు కళాశాల ప్రాంగణం నుంచి గాంధీబొమ్మ వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడి గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్ఐవో డాక్టర్ ఆదూరు శ్రీనివాసులు మాట్లాడుతూ స్వచ్ఛతపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా గాంధీబొమ్మ సెంటర్‌ను శుభ్రపరచడంతోపాటు మానవ హారం ఏర్పాటు చేసి విద్యార్థులతో స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేయించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కొండయ్య, అధ్యాపకులు చంద్రకళ, శ్రీదేవి, కృష్ణవేణి, పూర్ణచంద్ర కుమారి, కృష్ణతులసి తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌డీసీసీబీలో మొక్కలు నాటిన జేసీ

నెల్లూరు(హరనాథపురం) : స్వచ్ఛభారత్ దివస్ కార్యక్రమంలో భాగంగా నగరంలోని జిల్లా కేంద్రసహకార బ్యాంకు ఆవరణలో జాయింట్ కలెక్టర్ కార్తీక్ మొక్కలు నాటారు. బ్యాంకు సీఈవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

● పరిసరాల పరిశుభ్రతే లక్ష్యంగా భారతీయ స్టేట్ బ్యాంకు ప్రాంతీయ కార్యాలయం అధికారులు బుధవారం నగరంలోని చిల్డ్రన్స్ పార్కు పరిసరాలను శుభ్రం చేశారు. రీజినల్ మేనేజర్ ఎన్ శ్రీనివాసరావు, చీఫ్ మేనేజర్లు బీ శాంతిరాజ్, సీహెచ్ లోకనాథం, సురేష్, ఆర్ శేషగిరి, హెచ్ఆర్ మేనేజర్ పీ లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

కోవూరు: స్థానిక కోర్టు ఆవరణలో బుధవారం స్వచ్ఛత హి సేవ కార్యక్రమం నిర్వహించారు. సీనియర్ సివిల్ న్యాయాధికారి చైతన్య ఆధ్వర్యంలో సీనియర్ సివిల్ జడ్జి, జూనియర్ సివిల్ జడ్జి, మేజిస్ట్రేట్ కోర్టుల సిబ్బంది కోర్టు ప్రాంగణంలో చెత్తాచెదారాలు, పిచ్చిమొక్కలు తొలగించి శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో కోర్టు ఉద్యోగులు వేణుగోపాల్ నాయుడు, రవికుమార్, శైలజ, శ్రీదేవి, ప్రేమ్‌కుమార్, గిరి, ఆర్‌వీ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా సేవలో ఎమ్మెల్యే ప్రశాంతి



సాయిబాబాకు హారతి ఇస్తున్న కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

విడవలూరు, అక్టోబరు 2: మండలంలోని దంపూరులో ఉన్న సాయిబాబా ఆలయంలో టీడీపీ నేత దూది విజయరాఘవన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఆలయ వార్షికోత్సవంలో బుధవారం కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పాల్గొని సాయినాథునికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకి పూర్ణకుంభంతో సాదరంగా ఆహ్వానించారు. స్వామివారి దర్శనం అనంతరం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బెజవాడ వంశీకృష్ణారెడ్డి, చెముకుల కృష్ణచైతన్య, కొమ్మి శ్రీధర్‌నాయుడు, చెముకుల శ్రీనివాసులు, చేవూరు రాంప్రసాద్, హరిరెడ్డి, భార్గవ్, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వేగూరులో 'ఇది మంచి ప్రభుత్వం'

కోవూరు : మండలంలోని వేగూరులో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బుధవారం ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. టీడీపీ కార్యకర్తలు, నాయకులు ఇంటి గోడలకు స్టిక్కర్లు అంటించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తుమ్మలపెంట పార్వతి, సర్పంచు కరేటి అమరావతి, నాయకులు జెట్టి రాజగోపాలరెడ్డి, ఇంతా మల్లారెడ్డి, తిరుమూరు అశోక్‌రెడ్డి, గాదిరాజు అశోక్‌కుమార్, కే.సుధాకరరెడ్డి, దాసరి మురళీ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

రక్షణ కల్పించండి

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 2 : తమకు రక్షణ కల్పించాలని నెల్లూరు రూరల్ ఇందిరమ్మ కాలనీ వాసులు సిరిమల్లి ఏడుకొండలు, తన్నీరు మౌనిక కల్యాణి అధికారులకు విజ్ఞప్తి చేశారు. బుధవారం జర్నలిస్టు భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మేజర్లు అయిన తాము ప్రేమించుకుని గత నెలలో వివాహం చేసుకున్నామన్నారు. అయితే కులాలు వేరుకావడంతో తల్లిదండ్రులు ఇబ్బందిపెడుతున్నారని తెలిపారు. అనంతరం వారు నెల్లూరు రూరల్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి రక్షణ కల్పించాలని పోలీసులను కోరారు.

వేడుకగా కమలాకర్‌రెడ్డి జన్మదినం

నెల్లూరు రూరల్, అక్టోబరు 2 : టీడీపీ సీనియర్ నేత, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోడూరు కమలాకర్‌రెడ్డి జన్మదిన వేడుకలు బుధవానం ఆయన నివాసంలో ఘనంగా జరిగాయి. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పాల్గొని శుభాకాంక్షలు తెలియచేశారు. అనచరులు రక్తదాన శిబిరం నిర్వహించారు.

ఘనంగా రాజానాయుడు పుట్టినరోజు

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 2 : తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, మార్కాపురం నియోజకవర్గ పరిశీలకుడు దొడ్డపనేని రాజానాయుడు పుట్టిన రోజు వేడుకలు నగరంలోని ఆయన నివాసంలో బుధవారం ఘనంగా జరిగాయి. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, గిరిధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థిక సాయం



బాధితుడికి నగదు అందజేస్తున్న మాచిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి

మనుబోలు, అక్టోబరు 2: మనుబోలులో ఇటీవల జరిగిన బాణసంచా పేలుళ్ల బాధితు లకు బుధవారం శ్రీ సేవా నాథం ట్రస్టు వ్యవస్థాపకుడు మాచిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి ఆర్థిక సాయం అందజేశారు. బీసీ కాలనీలో తీవ్రంగా గాయపడిన కంద్రాతి గిరీష్‌కు రూ.25వేలు, మోమిడి లోకేష్‌కు రూ.20వేలు, కొమరాల మౌనికకు రూ.5వేలు వారి ఇళ్లకు వెళ్లి అందజేసి పరామర్శించారు. ఎలాంటి ఆపద వచ్చిన సేవానాథం ట్రస్టు తరఫున ఆదుకునేందుకు ముందుంటామని, త్వరగా కోలుకుంటారని వారికి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు, మాచిరెడ్డి యువత పాల్గొన్నారు.

అల్లూరు టీపీవో అవినీతిపై విచారణ జరిపించండి

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 2 : అల్లూరు నగర పంచాయతీ టౌన్ ప్లానింగ్ అధికారి(టీపీవో) అవినీతిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆర్ చెన్నకేశవులు అనే వ్యక్తి అధికారులను కోరారు. ప్రెస్ క్లబ్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆ పంచాయతీలో 1100 కొత్త ఇళ్ల నిర్మాణం పూర్త యిందని, కొందరు నగర పంచాయతీ అనుమతి లేకుం డానే ఇళ్లు నిర్మించాలని ఆరోపించారు. అలా ఇళ్లు నిర్మించుకున్న వారిని టౌన్‌ప్లానింగ్ అధికారి బెదిరించి ఒక్కొక్క ఇంటి యజమాని నుంచి రూ.14వేలు వంతున వసూలు చేశారన్నారు. టీపీవో తీరు వల్ల నగర పంచాయతీ ఆదాయానికి గండి పడిందని, ఆ అధికారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

దానధర్మాల్లో మీకు సాటిలేరు : ఆర్యవైశ్యులతో కోటంరెడ్డి



ఆర్యవైశ్య పేదలకు పింఛన్లు అందజేస్తున్న కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 2 : దానధర్మాలు చేయడంలో ఆర్యవైశ్యులకు సాటి ఎవరూలేరని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ప్రశంసించారు. బుధవారం రంగనాయకుల పేటలో జరిగిన ది నెల్లూరు ఆర్యవైశ్య బులియన్ మర్చంట్స్ పాన్ బ్రోకర్స్ అసోసియేషన్ వృద్ధాప్య పించన్ల పంపిణీకి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వంలో స్వేచ్ఛగా వ్యాపారాలు చేసుకుని మరిన్ని సేవా కార్యక్రమా లు చేయాలని కోరారు. కాగా, ఈ కార్యక్రమంలో 70 మంది ఆర్యవైశ్య వృద్ధులకు పించన్లు అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు కొనగళ్ల శోభన్‌బాబు, కార్యదర్శి ఏవీ ఫణీంద్ర కుమార్, కోశాధికారి బీ సుబ్రహ్మణ్యం, ఏకే సుబ్బరాయుడు, టీ కిషోర్, అమరా శివ, తదితరులు పాల్గొన్నారు.

7 లీటర్ల నాటు సారా స్వాధీనం

నెల్లూరు (క్రైం), అక్టోబరు 2: నాటుసారా విక్రయాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం దాడులు చేసి ఏడు లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. గాంధీ జయంతి డ్రైడే సందర్భంగా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఏసీ ఆదేశాల మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ వైవీ వెంకటేశ్వర్లు తన సిబ్బందితో నగరంలో తనిఖీలు చేపట్టారు. యాకోబు అనే వ్యక్తి బోగోలు నుంచి నాటుసారా తీసుకువచ్చి నగరంలోని హరనాథపురంలో విక్రయిస్తుండగా అరెస్ట్ చేశారు. నిందితుడి వద్ద నుంచి ఏడు లీటర్ల నాటుసారా, స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌ఐ ఖాలేషావలి, హెడ్‌కానిస్టేబుల్ ఏ రమేష్‌కుమార్, ఎం కిరణ్‌సింగ్, కానిస్టేబుళ్లు తులసీదాస్, పెంచలయ్య పాల్గొన్నారు.

వారాహి డిక్లరేషన్

నేటి సాయంత్రం తిరుపతిలో సభ

తిరుపతి, అక్టోబరు2(ఆంధ్రజ్యోతి): జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఉప ముఖ్యమంత్రి అయ్యాక తిరుపతిలో జరిగే తొలి బహిరంగ సభలో పాల్గొననున్నారు. 'వారాహి డిక్లరేషన్'ను జనసేనాని, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రజలకు వివరించనున్నారు. దీనికోసం తిరుపతి నగరం బాలాజీ కాలనీలోని పూలేవిగ్రహం వద్ద గురువారం సాయంత్రం వారాహి సభ నిర్వహించనున్నారు. తిరుమల లడ్డూ తయారీలో జంతువుల కొవ్వు కలిసిందంటూ ల్యాబ్ నివేదికలు వచ్చిన నేపథ్యంలో పవన్ ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టిన విషయం తెలిసిందే. సెప్టెంబరు 22నుంచి 11 రోజుల పాటు ఆయన ప్రాయశ్చిత దీక్షలో ఉన్నారు. తిరుమలలో బుధవారం ప్రాయశ్చిత్త దీక్షను విరమించిన ఆయన.. సాయంత్రం 5 గంటలపైన తిరుమలనుంచి నేరుగా సభాస్థలికి చేరుకోనున్నారు. పవన్ సొంత ఖర్చులతో ఈ సభ నిర్వహిస్తున్నారు. లడ్డూలో కల్తీ నెయ్యి వాడకం.. దీనిపై సుప్రీం కోర్టు ధర్మాసనం చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో పవన్ ప్రసంగంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.అలాగే, వారాహి డిక్లరేషన్‌లో ఏ అంశాలున్నాయనే దానిపైనా చర్చ సాగుతోంది. కాగా, పవన్‌కు ఉన్న ఇమేజ్ దృష్ట్యా జనసమీకరణపై జనసేన నేతలు దృష్టి పెట్టలేదు. రాయలసీమ జిల్లాలనుంచి పెద్దఎత్తున పార్టీ కార్యకర్తలు, అభిమానులు సభకు హాజరయ్యే అవకాశం ఉంది. కాగా, సభానంతరం రేణిగుంట విమానాశ్రయం చేరుకుని విజయవాడకు తిరుగుప్రయాణమవుతారు. సభ ఏర్పాట్లను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మాజీ ఎంపీ, బీజేపీ నేత వరప్రసాద్, జనసేన నాయకులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, కిరణ్ రాయల్, రాజారెడ్డి తదితరులు పరిశీలించారు.



తిరుమల ఆలయం ముందు 'వారాహి డిక్లరేషన్' పుస్తకంతో పవన్

టీడీపీ శ్రేణులు హాజరు కావాలంటూ సుగుణమ్మ పిలుపు

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆధ్వర్యంలో జరగనున్న వారాహి సభకు టీడీపీ శ్రేణులు హాజరుకావాలని ఆ పార్టీ తిరుపతి నియోజకవర్గ ఇంచార్జి సుగుణమ్మ ఒక ప్రకటనలో కోరారు. పార్టీ నాయకులు,డివిజన్ ఇంచార్జులు, అభిమానులు పవన్ సభలో పాల్గొని జయప్రదం చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

వారాహి సభ నేపథ్యంలో పవన్ కల్యాణ్ గతంలో తిరుపతి, తిరుమల వాసులకు ఇచ్చిన హామీలను ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు. మే 7న కూటమి పార్టీల తరపున టీడీపీ అధినేత చంద్రబాబుతో కలసి ఎన్నికల ప్రచార రోడ్‌షోలో ఆయన ఈ హామీలు ఇచ్చారు. అధికారంలోకి రాగానే వాటిని నెరవేరుస్తామని మాట ఇచ్చారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

మాటిచ్చారు... మరచిపోకండి!

జనసేనానికి తిరుపతి జనం వినతి


తిరుమల నిర్వాసితులకు ఇళ్లు : తన సోదరుడు చిరంజీవిని 2009లో తిరుపతి ప్రజలు ఎమ్మెల్యేగా గెలిపించారని, ఆయనకు తిరుపతిపై ఎనలేని ప్రేమాభిమానాలున్నాయని పవన్ రోడ్ షోలో ప్రస్తావించారు. తిరుమల నిర్వాసితులకు 1100 ఇళ్ళు నిర్మించి ఇవ్వాలని చిరంజీవి భావించారని, అందులో 149 ఇళ్ళు మాత్రమే పూర్తయ్యాయనీ, కూటమి అధికారంలోకి రాగానే మిగిలిన ఇళ్ళను కూడా నిర్మించి ఇస్తామని మాట ఇచ్చారు.

స్థానికులకు శ్రీవారి దర్శనం : గతంలో ప్రతి నెలా రెండవ మంగళవారం స్థానికులకు శ్రీవారి దర్శన సదుపాయం వుండేదనీ, వైసీపీ ప్రభుత్వం ఆ సదుపాయాన్ని తొలగించిందని విమర్శిస్తూ, తాము ఈ సౌకర్యాన్ని పునరుద్ధరిస్తామని ప్రకటించారు.

తిరుపతిలో విద్యా, వైద్యానికి నిధులు : కొవిడ్ సంక్షోభ సమయంలో తిరుపతి రుయా ఆస్పత్రిలో ఆక్సిజన్ కొరత కారణంగా పలువురు రోగులు మరణించిన విషాదాన్ని గుర్తు స్తూ, టీటీడీ సహకారంతో విద్య, వైద్య రంగాలకు నిధుల కొరత లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు.

మురికివాడల అభివృద్ధి : తిరుపతి నగరంలో 40కి పైగా మురికివాడలున్నాయంటూ,వైసీపీ విస్మరించిన వాటిని తాము అభివృద్ధి పరుస్తామని వాగ్దానం చేశారు. నగరంలో అస్తవ్యస్తంగా మారిన భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను బాగుచేసే బాధ్యతను కూటమి ప్రభుత్వం తీసుకుంటుందని మాటిచ్చారు.

- వైసీపీ నేతల వేధింపులు, కక్షసాధింపు చర్యలతో పారిపోయిన పెద్ద పరిశ్రమలను తిరిగి తీసుకొస్తామని ప్రకటించారు.
- తిరుపతిని పవిత్ర కేంద్రంగా కాపాడే బాధ్యతను కూటమి తరపున చంద్రబాబు, పురందేశ్వరి,తానూ కలసి తీసుకుంటామని హామీ ఇచ్చారు.



వాహన సేవల సమయాలు:
ప్రతిరోజు ఉదయం 8 నుంచి 10 గంటలకు వరకు,
రాత్రి 7 నుంచి 9 గంటల వరకు.

బుధవారం రాత్రి విద్యుద్దీపాల వెలుగులో శ్రీవారి ఆలయం



నేడు అంకురార్పణ

రేపు ధ్వజారోహణం.. సీఎం పట్టువస్త్రాల సమర్పణ

తిరుమల, ఆంధ్రజ్యోతి

బ్రహ్మోత్సవ సన్నాహాలు పూర్తయ్యాయి. నేడు అంకురార్పణతో సంబరాలు మొదలవుతాయి. రేపు ధ్వజారోహణం. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంప్రదాయంగా స్వామికి పట్టు వస్త్రాలు అందజేస్తారు. రాత్రికి జరిగే పెద్ద శేషవాహన సేవతో మాడ వీధుల్లో దేవదేవుడి విహారం మొదలవుతుంది. 11వ తేదీ దాకా వివిధ వాహనాలపై ఊరేగింపు సాగుతుంది. 12న చక్రస్నానంతో నవరాత్రి బ్రహ్మోత్సవాలు పరిసమాప్తమవుతాయి. బ్రహ్మోత్సవాలు మొదలైన రెండో రోజు నుంచి మూడు రోజుల పాటు మధ్యాహ్నం ఒంటి గంటకు రంగనాయక మండపంలో స్నపనతిరుమంజన సేవ నిర్వహిస్తారు. వివిధ రకాల పూలు, పండ్లతో మండపాన్ని అలంకరిస్తారు. డ్రైఫ్రూట్స్‌తో చేసిన కిరీటాలు, మాలలు ఉత్సవమూర్తులకు అలంకరిస్తారు. బహ్మోత్సవాలలో గరుడసేవ అత్యంత విశిష్టమైనది. లక్ష్మీహారం, మకరకంఠి, పచ్చ, సహస్రనామావళి వంటి విశేషమైన ఆభరణాలను మలయప్ప స్వామికి అలంకరించడం గరుడోత్సవ ప్రత్యేకత. ఎనిమిదవ రోజు రాత్రి అశ్వవాహనంతో వాహనసేవలు పరిసమాప్తమవుతాయి. తొమ్మిదవరోజు ఉదయం చక్రస్నానం, రాత్రి ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు పూర్తవుతాయి.

> " బ్రహ్మోత్సవాల వేళ తిరుమల కొండ ఆహ్లాదకరమైన వాతావరణంతో భక్తులకు స్వాగతం పలుకుతోంది. అడపాదడపా కురుస్తున్న వానలతో కొండలన్నీ పచ్చబారి అందంగా ఉన్నాయి. రంగురంగుల పూలతో వనాలు కళకళలాడతున్నాయి. దీపతోరణాలు, దేవతామూర్తుల రూపాలు, ఫల పుష్ప, చిత్ర ప్రదర్శనాశాల... తిరుమలలో ఆధ్యాత్మిక వాతావరణం భక్తులను ఆకట్టుకుంటోంది. "

ఘనంగా ఏర్పాట్లు

ఈ ఏడాది బ్రహ్మోత్సవ వేడుకల ఏర్పాట్లు ఘనంగా పటిష్ఠంగా జరుగుతున్నాయి. టీటీడీ ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి సారధ్యం వహిస్తున్నారు.

- ఆలయ మాడవీధుల్లో రంగవల్లులను తీర్చిదిద్దారు.
- మాడవీధుల్లో తాగునీటి కొళాయిలు, మరుగుదొడ్లను, గ్యాలరీలను ఆధునీకరించారు.
- గ్యాలరీల వద్ద తోపులాటలు లేకుండా పటిష్టమైన బ్యారికేడ్లు, క్యూలైన్లు ఏర్పాటు చేశారు.
- ఘాట్‌రోడ్లలో, తిరుమలలో రహదారులకు ఇరువైపులా గోడలకు రంగులు, ట్రాఫిక్ నిబంధనలు తెలిపే సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు.
- తిరుమలతో పాటు అలిపిరి వద్ద అదనపు పార్కింగ్ స్థలాలను సిద్ధం చేశారు.
- ఎలక్ట్రికల్ విభాగం ఆధ్వర్యంలో ఎల్ఈడీ లైట్ల తోరణాలను రహదాల మధ్యలో, చెట్లకు, డివైడర్లకు శోభాయమానంగా అలంకరించారు. ప్రధాన కూడళ్లలో, రద్దీ ప్రాంతాలలో భారీ కటౌట్లను ఏర్పాటుచేశారు.
- పాపవినాశనం టోల్‌గేట్ వద్దనున్న కల్యాణవేదికలో పలపుష్ప, మ్యూజియం, ఫొటో, ఆయుర్వేదం, శిల్ప ప్రదర్శనశాలలను ముస్తాబు చేస్తున్నారు.
- శ్రీవారి ఆలయం, వెలుపల, ప్రధాన కూడళ్లలో పలు రకాలు పూలమొక్కలను ఏర్పాటు చేశారు.
- వాహనం ముందు ప్రదర్శనలు ఇచ్చేందుకు దాదాపు 15 రాష్ట్రాలకు చెందిన కళాబృందాలను

రేపటి చంద్రబాబు పర్యటన ఇలా..



బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీవారికి ప్రభుత్వం తరపున పట్టువస్త్రాల సమర్పణకు శుక్రవారం సీఎం చంద్రబాబు తిరుమల రానున్నారు. సాయంత్రం 6.20 గంటలకు తిరుమలలోని పద్మావతి అతిథిగృహానికి చేరుకుంటారు. సంప్రదాయ వస్త్రధారణలో రాత్రి 7.40 గంటలకు బేడిఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణానికి వస్తారు. అక్కడ అర్చకులు చంద్రబాబుకు పరివట్టం చుట్టగా.. తలపై వెండిపళ్లెంలో పట్టువస్త్రాలను ఈవో ఉంచుతారు. మంగళవాయిద్యాల నడుమ 7.55 గంటలకు ఆలయానికి చేరుకుని వస్త్రాలను బహూకరించి మూలవర్లను దర్శించుకుంటారు. ఆ సమయంలో జీయంగార్లు శేషవస్త్రాన్ని మెడలో ధరింపచేస్తారు. అక్కడ్నుంచి రంగనాయకుల మండపానికి చేరుకుని 2025 టీటీడీ డైరీ, క్యాలెండర్లు ఆవిష్కరిస్తారు. 9.15 గంటలకు తిరిగి పద్మావతి విశాంత్రి భవనం చేరుకుంటారు. శనివారం ఉదయం 7.30 గంటలకు పాంచజన్యం అతిథిగృహం వెనుకభాగంలో నిర్మించిన వకుళమాత సెంట్రలైజ్డ్ కిచెన్‌ను ప్రారంభించి 7.55 గంటలకు తిరుగు ప్రయాణమవుతారు.

భద్రతపై ప్రత్యేక దృష్టి

ఇక ముఖ్యంగా భద్రతాపరంగా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. టీటీడీ విజిలెన్స్ సీవీఎస్వో శ్రీధర్, జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు సమన్వయంతో ప్రణాళికలు రూపొందించుకున్నారు. దాదాపు 5వేల పోలీసు, భద్రతా సిబ్బంది తోపాటు సుమారు 2,500 సీసీ కెమెరాలను అమర్చుతున్నారు. 8న గరుడసేవ సందర్భంగా 7వతేది అర్ధరాత్రి నుంచి, 9తేదీ ఉదయం 6గంటల వరకు ఘాట్‌రోడ్లలో ద్విచక్రవాహనాలను నిషేధించారు. శ్రీవారి ఆలయం, పోటు, అన్నప్రసాద విభాగం, వసతి, కల్యాణకట్ట, వైద్యం, ఆరోగ్యం, పీఆర్వో విభాగాలు అదనపు సిబ్బందిని ఏర్పాటు చేసుకున్నాయి.

ఒకప్పుడు నెలకో బ్రహ్మోత్సవం


ఏడాదికోసారి దేవదేవుడు, దేవేరులతో కలిసి ఊరేగే వేడుకలే బ్రహ్మోత్సవాలు. తిరుమల ఊరు చిన్నదైనా.. దేశంలోని అనేక ప్రాంతాల నుంచీ వచ్చే భక్తులతో బ్రహ్మోత్సవ వాహన సేవలు అలనాడు కూడా కిటకిటలాడుతూనే ఉండేవి. శ్రీనివాసుడి ఉత్సవాలు కాలానుగుణంగా అనేక మార్పుచేర్పులకు లోనవుతూనే ఉన్నాయి. ఒకప్పుడు నెలకొకటి చొప్పున ప్రతిఏడాది పన్నెండు బ్రహ్మోత్సవాలు కూడా జరిగేవని చెబుతారు. కాలక్రమేణా మార్పులు జరిగి, ఏడాదిలో ఒకసారి పది నుంచి పన్నెండు రోజులు పాటు బ్రహ్మోత్సవాలు జరగటం ప్రారంభమయ్యాయి. ఆ తర్వాత కూడా కొన్ని పరిణామాలతో రోజుల సంఖ్య తగ్గింది.

అధికమాసం అయితే రెండు

చాంద్రమానం ప్రకారం ప్రతి మూడవ ఏటా అధికమాసం వస్తుంది. ఇలా వచ్చిన సందర్భాల్లో కన్యామాసం (భాద్రపదం)లో ఒక బ్రహ్మోత్సవం, దసరా నవరాత్రుల్లో (ఆశ్వయుజం)లో మరోక బ్రహ్మోత్సవం నిర్వహిస్తారు. భాద్రపదంలో నిర్వహించే ఉత్సవాలను వార్షిక బ్రహ్మోత్సవాలు అనీ, నవరాత్రుల్లో నిర్వహించే ఉత్సవాలను నవరాత్రి బ్రహ్మోత్సవాలనీ పిలుస్తున్నారు. మిగిలిన కాలంలో కన్యామాసం, నవరాత్రులు కలిసే వస్తాయి కాబట్టి ఒకటే బ్రహ్మోత్సవం నిర్వహిస్తారు.



1957 నాటి బ్రహ్మోత్సవ ఆహ్వాన పత్రిక



గతంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా వాహన సేవ

- గుర్తుందా పవన్ సార్
  నాలుగు రోజుల్లో రోడ్డన్నారు
  మట్టితో సరిపెట్టారు
- బీఎన్ కండ్రిగ- సూళ్లూరుపేట రోడ్డును పట్టించుకోండి

- 7లో

బరితెగించిన ఇసుకాసురులు
- వీఆర్వో, వీఆర్ఏని లాగిపడేసి ట్రాక్టర్ తీసుకెళ్లిన తీరు
- సూళ్లూరుపేట పోలీసులకు వీఆర్వో ఫిర్యాదు

మద్యం దుకాణాలకు మూడు టెండర్లు

జిల్లాలో 227 మద్యం దుకాణాలకు మంగళవారం కలెక్టరు నోటిఫికేషన్ జారీ చేశారు. వీటికిగాను తిరుపతి అర్బన్ పరిధిలో బుధవారం మూడు టెండర్లు దాఖలయ్యాయి. కాగా, టెండర్ల కోసం తిరుపతి అర్బన్‌లో నాలుగు, రూరల్‌లో మూడు, శ్రీకాళహస్తిలో రెండు, మిగిలిన స్టేషన్ల వద్ద ఒక్కోటి చొప్పున కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగమల్లేశ్వర రెడ్డి తెలిపారు.

- తిరుపతి(నేరవిభాగం)

మహాత్ముడికి ఘన నివాళి

గాంధీ జయంతి సందర్భంగా బుధవారం జిల్లాలో మహాత్ముడికి ఘన నివాళులర్పించారు. కలెక్టరేట్‌లో మహాత్ముడి చిత్రపటానికి కలెక్టర్ వెంకటేశ్వర్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అంతకు ముందు నగరంలోని గాంధీ విగ్రహానికి కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, నగరపాలకసంస్థ కమిషనర్ ఎన్.మౌర్య, డీఆర్వో పెంచలకిషోర్, పలు శాఖల అధికారులు, నేతలు తదితరులు పాల్గొన్నారు.

- తిరుపతి(కలెక్టరేట్)



తిరుపతిలో గాంధీ విగ్రహం వద్ద కలెక్టరు, కమిషనరు తదితరుల నివాళులు

శోభాయమానం.. జెండా ఉత్సవం

గూడూరు, అక్టోబరు 2: గూడూరులో ఆంజనేయస్వామి జెండా ఉత్సవాలు బుధవారం రాత్రి శోభాయమానంగా జరిగాయి. ఎటుచూసినా జనసంద్రంగా మారింది. బజారువీధిలోని కలిశంకొట్టు వద్ద ఆంజనేయస్వామి జెండాకు తొలుత పూజలు నిర్వహించారు. ఈ జెండాను పట్టణ పొలిమేర్లలో తిప్పి కలిశంకొట్టు వద్దకు తీసుకొచ్చి ప్రతిష్ఠించి పూజలు జరిపారు. దీంతో జెండా ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆంజనేయ స్వామి జెండాలకు పూజలు చేశారు. రాత్రికి ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్లపై జెండాలను ఉంచి ఊరేగించారు. ఈ ఊరేగింపు ముందు బ్యాండు మేళాలు, తప్పెట్లు, జింగిరి మేళం, కోలాటాలు, బాణసంచా పేలుళ్ల, యువత చిందులతో సందడి చేశారు. బుట్టబొమ్మల వేషధారణలు అలరించాయి. ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ పలు వీధులలోని జెండా ఉత్సవాలకు హజరై స్వామివారికి పూజలు నిర్వహించారు. ఈ జెండా ఉత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి బంధుమిత్రులు, ఇతర చోట్ల ఉద్యోగాలు చేసే స్థానికులు, పరిసర గ్రామాల వారు తరలిరావడంతో పట్టణం సందడిగా మారింది. ప్రధానంగా గమళ్లపాళెం, తూర్పువీధి, కరణాలవీధి, మిట్టపాళెం, కోనేటిమిట్ట, కుమ్మరివీధి, అళఘనాథస్వామి దేవస్థానం, సత్రపువీధి, నలజాలమ్మవీధి, వీరారెడ్డిపల్లి, తిలక్‌నగర్‌సెంటర్, ఇందిరానగర్, అశోక్‌నగర్ , నరసింగరావుపేట, అడివయ్య కాలనీ, సిరామిక్ సెంటర్, మాళవ్యానగర్, ఐసీఎస్ రోడ్డు, శివాలయం సెంటర్, అరుంధతీయనగర్ తదితర ప్రాంతాలలో జెండా ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. డీఎస్పీ రమణకుమార్ ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.





ఆంజనేయ జెండా ఊరేగింపు

పవన్ సారూ..గుర్తుందా!

నాలుగు రోజుల్లో రోడ్డన్నారు.. మట్టితో సరిపెట్టారు



నీర్పాకోట గ్రామం దగ్గర ఇరువైపుల మట్టి తోలని దృశ్యం



రోడ్డుకు ఇరువైపుల తోలిన చోట వర్షాని ఏర్పడిన గుంతలు

"పవన్ కల్యాణ్ సారూ.. మీరు మాటిచ్చారు. ఇక మా తిప్పలు తప్పిపోయినాయి అని సంబరపడ్డాం. నాలుగంటే..నాలుగే రోజుల్లో రోడ్డు రెడీ అయిపోతుందని నమ్మినాం. రెండు నెలలు దాటిపోయిందయ్యా.. అదే రోడ్డు.. అవే తిప్పలు.. కాకపోతే మీరు చెప్పినారు కదా అని రోడ్డువారన ఇంత మట్టి పోసి చేతులు దులిపేసుకున్నారు. దీక్ష చేసి తిరుపతికి వచ్చారు. అదే దీక్షతో మీరు చెప్పిన మాట ఎందుకు అమలు కాలేదో అధికారులని అడగండయ్యా.."

బీఎన్ కండ్రిగ- సూళ్లూరుపేట మధ్య రోజూ ప్రయాణించే ప్రజల గోడు ఇది. అపాచీ, శ్రీసిటీ సెజ్‌ల్లో పనిచేయడానికి వేలాది మంది ఆటోల్లో, బైకుల్లో, బస్సుల్లో తిరిగే ఈ రోడ్డు దుస్థితి గురించి శ్రీహరికోట పర్యటనకు వచ్చినపుడు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టికి ఉద్యోగులు తీసుకువచ్చారు. ఆయన స్పందించి నాలుగు రోజుల్లో డబుల్ రోడ్డు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఆ వెంటనే అధికారులు రోడ్డుకి అటూఇటూ మట్టి పోసి పని పూర్తి చేశామనుకున్నారు. ఈ సింగల్ రోడ్డును డబుల్ రోడ్డుగా విస్తరించే కాంట్రాక్టు మూడేళ్ల కిందట అప్పటి మంత్రి గారి సంస్థే చేపట్టింది. మొదలుపెట్టి నాలుగు కిలోమీటర్లు వేసి ఆపేశారు. వందలాది వాహనాలు తిరిగే ఈ రోడ్డులో ఎదురు వాహనం వస్తే ప్రయాణం ప్రాణాంతకంగా మారుతోంది. కాలేజీలకు వెళ్లే విద్యార్థులు, పనులకు వెళ్లే వాళ్లు ప్రమాదాలకు గురవుతూనే ఉన్నారు. నాయకులెవ్వరూ పట్టించుకోలేదు. ఇంత కాలానికి డిప్యూటీ సీఎం దయ వల్ల రోడ్డు పని తిరిగి కదిలిందను కుంటే అదీ మొక్కుబడిగా ముగించేశారు. ఈశాన్య వానలు మొదలు కాబోతున్నాయి. పోసినమట్టి బురదగుంతలుగా మారి మరింత ఘోరంగా తయారయ్యే అవకాశం ఉంది. అందరు నాయకుల్లా ఆదేశాలతో సరిపెట్టుకోకుండా, నిధులు ఇప్పించే ఏర్పాటు కూడా పవన్ కల్యాణ్ చేయాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

- బుచ్చినాయుడుకండ్రిగ

జనసేనకు నాయకులు కావలెను

జిల్లాలో బలమున్నా కొరవడిన క్రియాశీలత

పవన్ కల్యాణ్ సమీక్షించి పటిష్ఠ పరుస్తారనే ఆశలో కేడర్

తిరుపతి, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లాలో జనసేన సందడంతా తిరుపతికే పరిమితం అయ్యింది. ఆ పార్టీ ఎమ్మెల్యే ఉండడం, అంతకు ముందు నుంచే పార్టీ స్వరం గట్టిగా వినిపించే యువ నాయకులు తిరుపతిలో ఉండడం ఇందుకు కారణాలు. ఇతర నియోజకవర్గాల్లో నాయకత్వ కొరత స్పష్టంగా కనిపిస్తోంది. పార్టీ కూడా తిరుపతి, శ్రీకాళహస్తి, సూళ్ళూరుపేట నియోజకవర్గాలకు మాత్రమే పార్టీ ఇంచార్జులను నియమించింది. మిగిలిన చంద్రగిరి, సత్యవేడు, గూడూరు, వెంకటగిరి నియోజకవర్గాలకు సమన్వయకర్తలతో సరిపెట్టింది. తిరుపతిలో నేడు వారాహి సభలో పాల్గొంటున్న జనసేన అధినేత పవన్ కల్యాణ్ పార్టీలో ఉన్న వెలితిని గుర్తించి, పటిష్ఠ పరిచే చర్యలకు శ్రీకారం చుడతారనే ఆశ జనసేన కేడర్‌లో ఉంది.

తిరుపతిలో సఖ్యత లేదు

తిరుపతిలోనూ జనసేన నేతల మధ్య సఖ్యత లేదు. ఎన్నికల ముందు మొదలైన తేడాలు ఇప్పటికీ పూడనే లేదు. ఇందుకు తగిన ప్రయత్నాలను పార్టీ అధిష్ఠానం కూడా గట్టిగా చేయలేదు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తిరుపతిలో తొలినుంచీ పార్టీ జెండా మోస్తున్నవారికి ప్రాధాన్యం ఇవ్వడం లేదని స్థానిక నేతల అసంతృప్తి. స్థానిక నేతలు కొందరు ఎమ్మెల్యేను సంప్రతించకుండా సొంత పద్ధతిలో కార్యక్రమాలు కొనసాగిస్తూ ఉండడం పట్ల ఎమ్మెల్యే వర్గం కూడా కినుకతో ఉంది. తిరుపతి కేడర్‌ను పట్టించుకోకుండా చిత్తూరు నుంచి మనుషులను దించారనీ, వైసీపీ మద్దతుదారులకే మేలు చేకూరేలా నిర్ణయాలు కొనసాగుతున్నాయనీ స్థానిక జనసేన నేతలు అంటున్నారు. విభేదాల నేపథ్యంలో నగరంలో అన్ని డివిజన్లలోనూ కేడర్‌ను పటిష్టపరచుకునే ప్రయత్నం కూడా సరిగా జరగడంలేదు. వైసీపీ కార్పొరేటర్లు పెద్ద సంఖ్యలో దూకడానికి సిద్ధంగా ఉన్నా నిర్ణయం తీసుకోలేని పరిస్థితిలో జనసేన నాయకులున్నారు. టీడీపీ, బీజేపీలతో సమన్వయంలోనూ వెలితి స్పష్టంగా కనిపిస్తోంది. తిరుపతిలో టీడీపీకి తొలి నుంచీ బలం ఉంది. ఆ పార్టీ నాయకులు జనసేనతో కలిసి వేదికల మీద కనిపిస్తూ ఉన్నా, డివిజన్ స్థాయి టీడీపీ కేడర్‌ను పట్టించుకోవడం లేదనే అసంతృప్తి ఉంది.

శ్రీకాళహస్తిలోనూ వర్గ పోరు

తిరుపతి తరువాత కాస్తో కూస్తో జనసేన కార్యక్రమాలు కనిపించేది శ్రీకాళహస్తిలోనే. అయితే అక్కడా పార్టీ రెండు గ్రూపులుగా విడిపోయింది. ఇక చంద్రగిరిలోనూ జనసేనలో రెండు వర్గాలున్నాయి. ఎర్రావారిపాలెం మండలానికి చెందిన ఓ నేత ఇంఛార్జిగా చెప్పుకుంటూ భూముల కబ్జాలకు పాల్పడుతున్నారంటూ ఇటీవల సామాజిక మాధ్యమాల్లో విస్తృత ప్రచారం కూడా జరిగింది. ఇక మిగిలిన నియోజకవర్గాల్లో టీడీపీ ఎమ్మెల్యేలు తమను పట్టించుకోవడం లేదనే అసంతృప్తి జనసేన నేతల్లో ఉంది. ఈ నియోజకవర్గాల్లో కార్యక్రమాలన్నీ మొక్కుబడిగానే సాగుతున్నాయి. సామాజికవర్గం పరంగా జిల్లాలో అనేక నియోజకవర్గాల్లో జనసేనకు బలం ఉంది. అలాగే పవన్‌కల్యాణ్ అభిమానులు కూడా పెద్ద సంఖ్యలోనే ఉన్నారు. అయితే దానిని రాజకీయంగా అనుకూలంగా మలచుకోవడంలో జనసేన ప్రయత్నాలు గట్టిగా లేవని అంటున్నారు. తిరుమల స్వామి దర్శనం తర్వాత తిరుపతిలో నేడు వారాహి సభలో పాల్గొంటున్న పవన్ కల్యాణ్ నియోజకవర్గాల వారీగా పరిస్థితులను సమీక్షించి, పటిష్ఠ పరిచే ప్రయత్నాలు చేస్తారనే ఆశలో కేడర్ ఉన్నారు. ఆయా నియోజకవర్గాల్లో నాయకత్వ ఎంపిక పూర్తి చేసి, వారికి దిశానిర్దేశం చేయాలని వారు కోరుకుంటున్నారు.

శ్రీవారిని స్మరిస్తూ..

● 50 నిమిషాల పాటు ఆలయంలో గడిపిన పవన్



అన్న ప్రసాదం స్వీకరిస్తున్న పవన్



ఆలయం ముందు వస్తూ..

తిరుమల, అక్టోబరు2(ఆంధ్రజ్యోతి): డిప్యూటీసీఎం హోదాలో తొలిసారిగా తిరుమలకు వచ్చిన పవన్‌కల్యాణ్ శ్రీవారిని స్మరిస్తూ ఆలయంలో 50 నిమిషాలు గడిపారు. బుధవారం ఉదయం 10.15 గంటలకు తన ఇద్దరు కుమార్తెలు ఆద్య, పొలెనా అంజనతో కలిసి మహద్వారం వద్దకు చేరుకోగా అదనపు ఈవో వెంకయ్య చౌదరి, అర్చకులు స్వాగతం పలికారు. క్యూలైన్ ద్వారా వచ్చిన దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్, ఆర్ట్ డైరెక్టర్ ఆనంద్‌సాయితో కలిసి స్వామిని దర్శించుకున్నారు. 10.55 గంటలకు రంగనాయకమండపానికి చేరుకోగా వేదపండితులు ఆశీర్వచనం చేశారు. 11.05 గంటలకు ఆలయం వెలుపలకు వచ్చిన ఆయన.. మాడవీధులో నడుచుకుంటూనే మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనానికి చేరుకున్నారు. కొందరు భక్తులతో మాట్లాడి తానూ వారితో కలిసి అన్నప్రసాదాలు స్వీకరించారు. చాలా రుచిగా ఉందంటూ ప్రశంసించారు. అన్నప్రసాదాల నాణ్యతను పెంచేందుకు తీసుకున్న చర్యల గురించి అదనపు ఈవో వెంకయ్య చౌదరి, క్యాటరింగ్ ఆఫీసర్ శాస్త్రి వివరించారు. మధ్యాహ్నం నుంచి ఆయన అతిథిగృహానికే పరిమితమయ్యారు. ధ్యానంలో గడిపారు. శుక్రవారం జపాలి ఆంజనేయస్వామిని దర్శించుకుని.. సాయంత్రం తిరుపతిలో జరిగే వారాహి సభలో పాల్గొననున్నారు. భక్తులకు ఇబ్బంది కలిగించకూడదనే ఉద్దేశ్యంతో పవన్ మహద్వారం నుంచి ఆలయంలోకి వెళ్లినట్టు అధికారులు తెలిపారు. దీక్షలో ఉన్న పవన్ కాలినడకన తిరుమలకు రావడంతో చాలా నీరసంగా కనిపించారు. ఎవరితోనూ పెద్దగా మాట్లాడలేదు. పవన్‌తో పాటు ఎంఎల్సీ హరిప్రసాద్, ఎమ్మెల్యేలు అరవ శ్రీధర్, ఆరణి శ్రీనివాసులు, స్థానిక నేతలు పసుపులేటి హరిప్రసాద్, కిరణ్‌రాయల్, రాజారెడ్డి తదితరులు శ్రీవారిని దర్శించుకున్నారు.

ముక్కంటి ఆలయ ఏఈవో ధనపాల్ సస్పెన్షన్

శ్రీకాళహస్తి, అక్టోబరు 2: ముక్కంటి ఆలయ ఏఈవో ధనపాల్‌ను సస్పెండ్ చేస్తూ ఈవో చంద్రశేఖర్ ఆజాద్ ఆదేశాలు జారీ చేశారు. ఆలయ ఈవోగా కొత్తగా బాధ్యతలు చేపట్టిన చంద్రశేఖర్ ఇటీవల పలు విభాగాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా గోశాలను బుధవారం ఉదయం పరిశీలించారు. గోశాల నిర్వహణలో అధికారుల నిర్లక్ష్యం, సిబ్బంది వైఫల్యాలను గుర్తించారు. గోశాల ఏఈవో ధనపాల్ పర్యవేక్షణ విఫలంతో వందలాది గోవులకు ప్రాణాంతక సమస్య ముప్పు వాటిల్లుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత వైసీపీ పాలనలో ఏఈవోగా ధనపాల్ ఆలయం తరపున ఏర్పాటు చేసిన విభూది విక్రయ కేంద్రాల్లో అవకతవకలకు పాల్పడినట్లు విచారణ ద్వారా గుర్తించారు. నిబంధనలకు విరుద్ధంగా ఆలయ ఉద్యోగి గంగాధరం సతీమణి పేరుతో విభూది విక్రయ టెండర్‌ను దక్కించుకోవడంలో ధనపాల్ పాత్ర ఉందని... అందులో సంప్రదాయాలకు విరుద్ధంగా ప్లాస్టిక్ ప్యాకింగ్ ఉపయోగించడం, అలాగే టెండర్లకు విరుద్ధంగా అదనపు వస్తువులను కౌంటర్‌లో విక్రయించడం, దాంతో పాటు టెండర్ షరతులను ఉల్లంఘిస్తూ కౌంటర్‌లో విక్రయించే వస్తువులపై ముక్కంటి ఆలయ దేవతామూర్తుల బొమ్మలను ముద్రిదంచడం వంటి చర్యలను ఈవో తప్పు పట్టారు. ఏఈవో ధనపాల్ పర్యవేక్షణలో 9 వైఫల్యాలను పొందుపరుస్తూ సస్పెండ్ చేస్తున్నట్లు ఆదేశాలు జారీ చేశారు. ఇతని బాధ్యతలను డిప్యూటీ ఈవో కృష్ణారెడ్డికి అప్పగించారు.

గ్రామీణ అభియాన్‌కు మూడు గ్రామాల ఎంపిక

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు2: ప్రధాన మంత్రి జన్ జాతీయ ఉన్నత గ్రామ్ అభియాన్‌కు జిల్లాలో మూడు గ్రామాలు ఎంపికైనట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. ఇందులో డక్కిలి మండలం కండలవారిపల్లి, శ్రీకాళహస్తి మండలం మేలచ్చూరు, వరదయ్యపాళెం మండలం పాదిరికుప్పం గ్రామాలు ఉన్నట్లు వెల్లడించారు. గిరిజనాభివృద్ధిపై దృష్టి సారించి, మౌలిక సదుపాయాలు, ఆరోగ్యం, విద్య, జీవనోపాధి వంటి కీలక సేవలను విస్తరించడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని ఆయన వివరించారు.

మా ట్రాక్టరే పట్టుకుంటారా?

● అధికార పార్టీ నాయకుడినంటూ రెవెన్యూ సిబ్బందిపై ఆగ్రహం
● వీఆర్వో, వీఆర్‌ఏని లాగిపడేసి ఇసుక ట్రాక్టర్ తీసుకెళ్లిన యజమాని
● సూళ్లూరుపేట పోలీసులకు ఫిర్యాదు





పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న వీఆర్వో శ్రీదేవి - మన్నారుపోలూరు వద్ద ఇసుకను తోడేసిన దృశ్యం

సూళ్లూరుపేట, అక్టోబరు 2: ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. అధికారులను బెదిరిస్తున్నారు. సూళ్లూరుపేటలో ఇసుక ట్రాక్టరును పట్టుకున్న వీఆర్వో, వీఆర్‌ఏను లాగి పడేసి ట్రాక్టరును తీసుకెళ్లిపోయారు. వివరాలిలా ఉన్నాయి. ఇలుపూరు సమీపంలోని కాళంగి నది నుంచి రాత్రింబవళ్లు తేడా లేకుండా ట్రాక్టర్ల ద్వారా ఇసుకను అక్రమ రవాణా చేస్తున్నారు. ఈ క్రమంలో ఇసుక అక్రమ రవాణాను నియంత్రించేందుకు ఇలుపూరు వద్ద సిబ్బందికి విధులు కేటాయించారు. వీఆర్‌ఏలు సుబ్రమణ్యం, శివ కాళంగి నుంచి ఇసుక లోడుతో వస్తున్న ట్రాక్టర్‌ను ఆపి వీఆర్వో శ్రీదేవికి సమాచారమిచ్చారు. వెంటనే వీఆర్వో అక్కడకు చేరుకొని డ్రైవర్‌ను విచారిస్తుండగా, ట్రాక్టర్ యజమాని మణికంఠ అక్కడకు చేరుకొన్నారు. ఇసుక తరలింపునకు అనుమతులు లేవని, తాము అధికార పార్టీకి చెందిన వాళ్లమని, వదిలేయాలంటూ సిబ్బందిని బెదిరించారు. వెంటనే వీఆర్వో తహశీల్దార్‌కు సమాచారమిచ్చి ట్రాక్టర్‌లో వీఆర్‌ఏ సుబ్రమణ్యంను ఎక్కించి పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళుతున్నారు. మన్నారుపోలూరు శివాలయం వద్ద ట్రాక్టర్‌ను మరో మార్గంవైపు మళ్లించి ఇసుకను అక్కడే అన్‌లోడ్ చేసేందుకు ప్రయత్నించారు. వెంటనే వీఆర్వో తన మొబైల్‌లో ఆ దృశ్యాలను చిత్రీకరిస్తుండగా ట్రాక్టర్ ఓనర్ వాగ్వాదానికి దిగాడు. సెల్‌ఫోన్‌ను లాగి కిందపడేసి ట్రాక్టర్‌ను తీసుకెళ్లిపోయాడు. వీఆర్వో, వీఆర్‌ఏ పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని ట్రాక్టర్ ఓనర్‌పై ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

నన్ను బెదిరించారు

ఇసుక ట్రాక్టర్‌ను తీసుకొస్తుండగా అధికార పార్టీకి చెందినవాడినని, తమ ట్రాక్టరు ఆపకూడదంటూ ఓనరు బెదిరించినట్లు వీఆర్వో తెలిపారు. ఫొటోలు తీస్తుండగా సెల్‌ఫోన్‌ను లాక్కొని, వీఆర్‌ఏను పక్కకు లాగేసి ట్రాక్టర్‌ను తీసుకెళ్లారన్నారు. ప్రస్తుతం అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్‌తో దొరికిన వ్యక్తి గతంలో వైసీపీలో ఉంటూ స్మగ్లింగ్ పాల్పడేవాడు. మళ్లీ టీడీపీ అధికారంలోకి వచ్చేసరికి ఆ పార్టీ నాయకులతో తిరుగుతూ ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. కాగా, గత కొన్ని రోజులుగా అధికార పార్టీకి చెందిన నాయకులు కొందరూ కాళంగి నది ఇసుకను అక్రమ రవాణా యథేచ్ఛగా చేస్తున్నారు. వారం రోజుల ముందు ఒక ఇసుక ట్రాక్టర్‌ను రెవెన్యూ అధికారులు పడితే ఆ పార్టీ పెద్దల చేత పంచాయతీ పెట్టి రాజీ కుదిర్చే ప్రయత్నాలు చేశారు.

నేటి నుంచి ఉపాధ్యాయ అర్హత పరీక్షలు

● రోజుకు రెండు సెషన్లుగా 21వ తేదీ వరకు ● జిల్లాలో 37,610 మందికి 9 కేంద్రాలు



టెట్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ ప్రసన్నకుమార్

తిరుపతి(విద్య), అక్టోబరు 2: ఉపాధ్యాయ అర్హత (టెట్) పరీక్షలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 21వ తేదీ వరకు ఎంపిక చేసిన కేంద్రాల్లో ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. ఆన్‌లైన్ విధానంలో జరిగే టెట్ పరీక్షల కోసం జిల్లాలో 9 కేంద్రాలను అధికారులు సిద్ధం చేశారు. 37,610 మంది అభ్యర్థులు టెట్ పరీక్షలు రాయనున్నారు. వీరిలో 88 వికలాంగ అభ్యర్థులకు స్క్రైబ్స్‌ను ఏర్పాటు చేసుకునేందుకు అధికారులు అవకాశం కల్పించారు. అలాగే వారికి నిబంధనల ప్రకారం 50 నిమిషాల అదనపు సమయాన్ని కేటాయించనున్నారు. టెట్ పరీక్షకు సంబంధించి అమరావతిలోని పబ్లిక్ లైబ్రరీస్ డైరెక్టర్ డాక్టర్ ఎంఆర్ ప్రసన్న కుమార్‌ను రాష్ట్ర ప్రభుత్వం జిల్లా పరిశీలకులుగా నియమించింది. ఆయన బుధవారం జిల్లాలోని పలు పరీక్ష కేంద్రాలను సందర్శించి వసతులను పరిశీలించారు.

ఇవే పరీక్ష కేంద్రాలు..

పుత్తూరు శ్రీవెంకట పెరుమాళ్ ఇంజినీరింగ్ కళాశాల, తిరుపతి రేణిగుంట రోడ్డులోని చదలవాడ కృష్ణమూర్తి ఇంజినీరింగ్ కళాశాల, తిరుపతి - కరకంబాడి మార్గంలోని శ్రీరామ ఇంజనీరింగ్ కళాశాల, అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల, చంద్రగిరి రామిరెడ్డిపల్లె అయాన్ డిజిటల్ జోన్, తిరుపతి చెర్లోపల్లిలోని అయాన్ డిజిటల్ జోన్, కోట విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల, ఎన్‌బీకేఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాల, గూడూరు దూర్జటిలోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో టెట్ పరీక్షలు జరుగనున్నాయి.



ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ

శ్రీకాళహస్తి,అక్టోబరు 2: శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం భక్తుల రద్దీ నెలకొంది . మహాలయ అమావాస్య కావడంతో భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. సుమారు 28 వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 848మంది, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 1,809మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 2,156మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 902, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 233మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 208మంది, రూ.5వేల టిక్కెట్ల ద్వారా 88మంది భక్తులు పూజలు చేయించుకున్నారు. ఇక ఐదు రకాల ప్రసాదాలు కలిపి 18,758 విక్రయించినట్టు ఆలయ అధికారులు తెలిపారు.

ఎస్వీయూ ఇన్‌చార్జి వీసీకి అస్వస్థత

● న్యూరో సమస్యతో ఆస్పత్రిలో చికిత్స

తిరుపతి(విశ్వవిద్యాలయాలు),అక్టోబరు2: ఎస్వీయూ ఇన్‌చార్జి వీసీ అప్పారావు అస్వస్థతకు గురయ్యారు. బుధవారం ఉదయం 6 గంటల సమయంలో కళ్లు తిరగడంతో వర్సిటీ ఆరోగ్య కేంద్రానికి వచ్చారు. అదే సమయంలో వాంతులు కావడంతో వైద్యులు క్వార్టర్స్‌లోనే గంటపాటు వైద్య సేవలు అందించారు. బీపీ, షుగర్ చెక్ చేయగా నార్మల్‌గానే ఉన్నట్టు తెలిసింది. అయితే, గత రాత్రి తిన్న ఆహారం జీర్ణం కాకపోవడంతో కొంత ఇబ్బంది ఏర్పడినట్లు సమాచారం. కళ్లు తిరగడానికి మూల కారణం స్పాంటిలైటిస్ - వెర్టిగో సమస్యగా వైద్యులు చెప్పినట్టు తెలుస్తోంది. ప్రస్తుతానికి ఆరోగ్యం కుదుటపడినప్పటికీ మెడకు బ్యాండ్ వాడమని, రెండు రోజులు విశ్రాంతి అవసరమని వైద్యులు సూచించినట్టు తెలుస్తోంది. అప్పారావును రిజిస్ట్రార్ భూపతి నాయుడు పరామర్శించారు.

కంకణ భట్టాచార్యులుగా ఏఎస్ గోవిందాచార్యులు

తిరుమల, అక్టోబరు2(ఆంధ్రజ్యోతి): శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు కంకణ భట్టాచార్యులుగా సీనియర్ అర్చకుడు ఏఎస్ గోవిందాచార్యులు వ్యవహరించనున్నారు. ఏటా బ్రహ్మోత్సవాల్లో అర్చకుల్లో ఒక్కరిని కంకణ భట్టాచార్యులుగా నియమిస్తారు. ఈ క్రమంలోనే పూర్వం బ్రహ్మోత్సవాలతో పాటు వసంతోత్సవాలు వంటి కైంకర్యాలను విజయవంతంగా నిర్వహించిన గోవిందాచార్యులను ఈ ఏడాది కంకణభట్టాచార్యులుగా ఎంపిక చేశారు. అంకురార్పణ నుంచి చక్రస్నానం వరకు వాహనసేవలో, యాగశాలలోని వైదిక కార్యక్రమాలు, ఇతర పూజల్లో ఆయన ప్రధాన పాత్రపోషిస్తారు. ఉదయం, సాయంత్రం మడిని పాటిస్తూ నిత్యహోమాలు, ఇతర వైదిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఉత్సవాలు పూర్తయ్యే వరకు పొలిమేర దాటి వెళ్లరు.

55 మంది అర్చకుల ఏర్పాటు

ఇక, ఉదయం, రాత్రి వాహన సేవలతో పాటు యాగశాల, గర్భాలయం, ఉప ఆలయాలు వంటి వివిధ ప్రాంతాల్లో కైంకర్యాల కోసం 55 మంది అర్చకులను ఏర్పాటు చేశారు. వీరితో పాటు వాహనసేవల్లో కొలువు దీరే ఉత్సవమూర్తులను అలంకరించేందుకు చెన్నై నుంచి ప్రత్యేకంగా మరో ఇద్దరు అలంకరణ భట్టాచార్యులు తిరుమలకు చేరుకున్నారు.

ఆరేళ్ల అస్పియాను చంపేశారు

● ఆదివారం అదృశ్యమైన చిన్నారి శవమై చెరువులో తేలింది
● కారణాలను అన్వేషిస్తున్నామన్న ఎస్పీ



అస్పియా (ఫైల్ ఫొటో)



బిడ్డ మృతదేహాన్ని చూసి రోదిస్తున్న అజ్మతుల్లా

పుంగనూరు, అక్టోబరు 2 : ఆదివారం రాత్రి ఇంటి ముందు ఆడుకుంటూ కన్పించకుండా పోయిన చిన్నారి అస్పియా(6) బుధవారం నాటికి చెరువులో శవమై తేలి కుటుంబాన్ని శోకసంద్రంలో ముంచింది.నాలుగురోజులుగా 11పోలీసు బృందాలు గాలిస్తున్నా చిన్న క్లూ కూడా లభించని పరిస్థితుల్లో అస్పియా శవమై కన్పించడం అందరినీ దిగ్భ్రాంతికి లోనుచేసింది.అస్పియాను చంపేసి సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకులో పడేశారనే విషయం బుధవారం ఉదయం 11గంటలకు దావానలంలా వ్యాపించగా వందల సంఖ్యలో శవాన్ని చూసేందుకు చెరువు వద్దకు చేరుకున్నారు.శవాన్ని చూసి కంటతడిపెట్టారు. ఇందుకు కారకులైన వారిని గుర్తించి శిక్షించాలని డిమాండ్ చేశారు. పుంగనూరు ఉబేదుల్లా కాంపౌండ్‌లోని వడ్డీ వ్యాపారి ఎస్.అజ్మతుల్లా, ఆసియా దంపతులకు కుమారుడు అశ్వక్ (13), కుమార్తె అస్పియా అంజుమ్(6) ఉన్నారు. ఆదివారం రాత్రి 7గంటల ప్రాంతంలో అస్పియా ఇంటి ఎదుట పిల్లలతో కలిసి ఆడుకుంటుండగా కొద్దిసేపు కరెంట్ పోయింది.అప్పట్నుంచీ అస్పియా కనిపించలేదు. చుట్టుపక్కల వీధుల్లో గాలించినా లాభం లేకపోవడంతో రాత్రి 10.30 గంటలకు సీఐ శ్రీనివాసులుకు ఫిర్యాదు చేశారు.ఈ విషయాన్ని ఎస్పీ మణికంఠ దృష్టికి తీసుకుపోవడంతో ఆయన వెంటనే స్పందించారు. డీఎస్పీలు ప్రభాకర్, సాయినాథ్, ఇలియాస్ బాషా, మహబూబ్‌బాషా, సీఐలు భాస్కర్, శ్రీనివాసులు, ఉమామహేశ్వరరావు, ప్రసాద్, పలువురు ఎస్ఐలు, నేరవిభాగంలో నిష్ణాతులైన కొంతమందిని 11 బృందాలుగా ఏర్పాటు చేసి గాలింపు మొదలుపెట్టారు. ఈ నేపథ్యంలో పుంగనూరు ఎన్ఎస్‌పేటలోని బావాజాన్ కుమారుడు అయాజ్ (4) ఇంటి వద్ద ఆడుకుంటుండగా ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంలో వచ్చి చాక్లెట్ ఇస్తామని పిలవడం అతడి తల్లిదండ్రులు గమనించారు. మీరెవరంటూ ప్రశ్నించబోగా వారు పరారయ్యారు.వెంటనే తెలిసిన వారికి ఫోన్లు చేసి మోటారు సైకిళ్లలో వెంబడించారు.వారికోసం వెతుకుతూ సమీపంలోని సమ్మర్ స్టోరేజీ ట్యాంకు వద్దకు వెళ్లగా నీటిలో తేలుతున్న శవం కన్పించింది. వెంటనే పోలీసులకు చెప్పడంతో బాలిక తండ్రి అజ్మతుల్లాను అక్కడికి తీసుకొచ్చారు. శవాన్ని చూసి తన బిడ్డేనంటూ అజ్మతుల్లా రోదించాడు. ఈ విషయం తెలిసి వందలమంది అక్కడికి చేరుకున్నారు.స్థానికులే చెరువులోకి దిగి మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చగా శవపరీక్ష కోసం పుంగనూరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి పోలీసులు తరలించారు.ఎస్పీ మణికంఠ జాయింట్ కలెక్టర్ విద్యాధరి ఆస్పత్రి వద్దకు చేరుకుని కుటుంబీకులు, ముస్లిం మతపెద్దలతో చర్చించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మధుసూదనాచారి నేతృత్వంలో ఏడుగురు వైద్యుల బృందం పోస్టుమార్టం చేసి శరీరంలోని కొన్ని అవయవాలను నిల్వచేసి తిరుపతి ల్యాబ్‌కు పంపారు. మృతదేహంపై ఎలాంటి గాయాలులేవని వైద్యులు తెలిపారు.ఆస్పత్రి నుంచి అస్పియా మృతదేహాన్ని వందలాదిమంది సమీపంలోని ఖబరస్తాన్ వద్దకు తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు.

పథకం ప్రకారమే చంపేశారా?

అస్పియా తండ్రి అజ్మతుల్లా వడ్డీ వ్యాపారం చేస్తుండడం వల్ల వ్యాపారలావాదేవీల్లో గొడవలు, ఇతర కారణాలతో చిన్నారిని కిడ్నాప్ చేసి చంపేశారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎక్కడా కూడా సీసీ కెమెరాలకు చిక్కకుండా, ఆధారాలు దొరక్కుండా జాగ్రత్త పడ్డారంటే పథకం ప్రకారమే చంపేశారా అనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి.పుంగనూరులో విచ్చలవిడిగా గంజాయి, సారా, కర్ణాటక మద్యం లభిస్తుండడంతో ఆ మత్తులో ఆకతాయిలు ఇలా చేశారా, లేక బిడ్డను కిడ్నాప్ చేసి తండ్రి నుంచి డబ్బులాగాలని అఘాయిత్యానికి పాల్పడ్డారా అనే అనుమానాలను మరికొందరు వ్యక్తపరుస్తున్నారు.ఈ విషయమై ఎస్పీ మణికంఠ మాట్లాడుతూ అస్పియా మృతిపై కారణాలను అన్వేషిస్తున్నామని తెలిపారు. మృతురాలి శరీరభాగాలను సేకరించి తిరుపతి ల్యాబ్‌కు పంపామని, అక్కడి నుంచి రిపోర్టు రావడానికి 2వారాల సమయం పడుతుంది అని చెప్పారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

నేటి నుంచి చెంగాళమ్మ ఆలయంలో శరన్నవరాత్రుల వేడుకలు



విద్యుత్ దీపకాంతుల్లో చెంగాళమ్మ ఆలయం

సూళ్లూరుపేట, అక్టోబరు 2: సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ ఆలయం దేవి నవరాత్రుల వేడుకలకు ముస్తాబైంది. ఈ నెల 3నుంచి 12వ తేదీ వరకు నవరాత్రుల వేడుకలు వైభవంగా జరగనున్నాయి. 3న తొలిరోజు చెంగాళమ్మ పరమేశ్వరి అలంకారం, 4న గాయత్రి, 5న అన్నపూర్ణ, 6న బాలత్రిపుర సుందరి, 7న అష్టకాళి, 8న మహాలక్ష్మి, 9 సరస్వతి, 10న దుర్గాదేవి, 11న రాజరాజేశ్వరి, 12న చివరి రోజు మహిషాసురమర్ధిని అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ప్రతి రోజు అమ్మవారికి విశేష పూజలు, చండీయాగం నిర్వహించనున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ పైకి దూసుకువెళ్లిన బైక్

గూడూరు అర్బన్, అక్టోబరు 2: స్థానిక ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ పైకి ఓ ద్విచక్ర వాహనం దూసుకువెళ్లిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. స్థానిక పాలిటెక్నిక్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు బైక్‌పై వెళుతూ అదుపుతప్పి ట్రాన్స్‌ఫార్మర్‌పైకి దూసుకువెళ్లారు. ఈ ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి.

మద్యం దుకాణాలకు దరఖాస్తుల స్వీకరణ

గూడూరు అర్బన్, అక్టోబరు 2: గూడూరు సర్కిల్ పరిధిలో మద్యం దుకాణాలకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైందని ఎక్సైజ్ సీఐ కరీమాబేగం బుధవారం తెలిపారు. ఈనెల 9వ తేదీ వరకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఈనెల 11న కలెక్టర్ నేతృత్వంలో లాటరీ తీసి లైసెన్స్ కేటాయిస్తారని, 12 నుంచి దుకాణాలను ప్రారంభించుకోవచ్చన్నారు.





గూడూరులోని కోనేటిమిట్టలో ఆంజనేయస్వామి జెండాకు వీధోత్సవం నిర్వహిస్తున్న భక్తులు - కోట బజారుసెంటర్‌లో ఊరేగుతున్న జెండా, ఉత్సవ విగ్రహం

వేడుకగా ఆంజనేయస్వామి జెండా ఉత్సవాలు

గూడూరు, అక్టోబరు 2: గూడూరు పట్టణంలో వాడవాడలా ఆంజనేయస్వామి జెండా వీధోత్సవాలను వేడుకగా నిర్వహించారు. బుధవారం ఉదయం ఆంజనేయస్వామి జెండాకు పూజలు నిర్వహించి తప్పెట్లు, తాళాల మధ్య భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. అనంతరం ఆలయాల వద్ద జెండాను ప్రతిష్టించారు. రాత్రి ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌పై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు తరలిరావడంతో పట్టణం జనసంద్రంగా మారింది.

నేడు కలశ స్థాపనతో శరన్నవరాత్రులు ప్రారంభం

పట్టణంలో వివిధ అమ్మవారి ఆలయాల్లో గురువారం కలశ స్థాపనతో శరన్నవరాత్రులను ప్రారంభించనున్నారు. నారాయణమ్మ పేరంటాళ్లు, మహాలక్ష్మమ్మ, కన్యకాపరమేశ్వరి, రాజరాజేశ్వరి, గంగమ్మ ఆలయం, మాళవ్యనగర్ మహాలక్ష్మమ్మ, ద్రౌపదీదేవి సమేత ధర్మరాజస్వామి, బజారువీధిల్లోని ఆలయాల్లో కలశ స్థాపనకు ఏర్పాట్లు పూర్తిచేశారు.

కోట: పట్టణంలో ఆంజనేయస్వామి జెండా ఊరేగింపు నిర్వహించారు. స్థానిక ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో స్వామివారి విగ్రహానికి అభిషేకాలు చేసి విశేష అలంకరణలో ఉంచారు. అక్కడ నుంచి ఆంజనేయస్వామి చిత్రపటంతో జెండాలను చేతపట్టుకొని స్థానిక లక్ష్మీగణపతి ఆలయం నుంచి శివాలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. అలాగే పట్టణంలోని గాంధీబొమ్మ, బజారు, ఆర్టీసీ సెంటర్ల మీదుగా జెండాలతో ఆంజనేయస్వామి ప్రతిమలను ఊరేగించారు. గూడలి, శ్యామసుందరపురంలో అభయాంజనేయస్వామి చిత్రపటాలతో గ్రామోత్సవం నిర్వహించారు.



పారిశుధ్య కార్మికులకు అండగా నిలుస్తా: పాశిం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశిం

గూడూరు, అక్టోబరు 2: మున్సిపాలిటీలో పనిచేసే పారిశుధ్య కార్మికులకు అండగా నిలుస్తానని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో స్వచ్ఛతా హీ సేవా ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీ జయంతిని పురస్కరించుకుని స్వచ్ఛభారత్ మిషన్ ఆధ్వర్యంలో సెప్టెంబరు 17నుంచి బుధవారం వరకు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించి పట్టణాన్ని శుభ్ర పరచడం జరిగిందన్నారు. ఇందులో పారిశుధ్య కార్మికుల సేవలను మరువలేమన్నారు. ఇటీవల విజయవాడలో సంభవించిన వరదల్లో గూడూరు మున్సిపాలిటీకి చెందిన 11మంది పారిశుధ్య కార్మికులు సేవలు అందించారని, వారికి పురస్కారాలను అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక 7వ వార్డులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రీడింగ్ రూమ్‌లో వసతులను మెరుగు పరిచి ఎమ్మెల్యే చేతుల మీదుగా పునఃప్రారంభించారు. కార్యక్రమలో పులిమి శ్రీనివాసులు, గోను శివకుమార్, అరవ పార్వతయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధికి రూ.10 లక్షల విరాళం



ఎమ్మెల్యే విజయశ్రీకి చెక్కును అందజేస్తున్న అపాచీ జనరల్ మేనేజర్ చాంగ్‌చింగ్

నాయుడుపేట టౌన్, అక్టోబరు 2: వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయనిధికి మాంబట్టు అపాచీ జనరల్ మేనేజర్ చాంగ్‌చింగ్ రూ.10లక్షల చెక్కును ఎమ్మెల్యే విజయశ్రీకి అందజేశారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో బుధవారం సాయంత్రం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకి చెక్కు అందజేశారు. అపాచీ పీఆర్ మోహన్, పార్థసారధి పాల్గొన్నారు. అలాగే నాయుడుపేట బలిజసంఘ నాయకులు రూ.1,51,116 ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, పార్థసారధిలకు అందజేశారు. బలిజ సంఘ నాయకులు పగడాల శివప్రదీప్, కుబేరుమణి, హంసా వృద్ధిచెంగ్, లక్ష్మీనారాయణ, సుబ్బారావు, జలంధర్, మోహన్ రావు, మహేష్, సునీల్, ప్రకాష్ పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

13 సవర్ల బంగారు ఆభరణాల రికరీ



నిందితుడి, రికవరీ చేసిన బంగారు ఆభరణాలతో పోలీసులు

సూళ్లూరుపేట, అక్టోబరు 2: ఇంట్లో ఎవరు లేని సమయాల్లో చోరీలకు పాల్పడే నిందితుడిని అరెస్టు చేసినట్లు నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు తెలిపారు. నిందితుడి వద్ద నుంచి 13 సవర్ల బంగారు ఆభరణాలు రికవరీ చేశారు. బుధవారం సూళ్లూరపేట పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ మీడియాకు వివరాలు వెల్లడించారు. మన్యం జిల్లా పార్వతీపురానికి చెందిన చందక మణికంఠ శ్రీసిటీలోని ఓ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. తడ, శ్రీసిటీ పరిసర ప్రాంతాల్లో సంచరిస్తూ ఇళ్లలో ఎవరూ లేని సయమాల్లో చోరీలకు పాల్పడేవాడు. తడ సుజాతనగర్‌లో ఇటీవల జరిగిన ఓ ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. అదే విధంగా శ్రీసిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ ఇంట్లో, వరదయ్యపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ ఇంట్లో చోరీకి పాల్పడ్డాడు. తడ ఎస్ఐ కొండపనాయుడు ఇటీవల జరిగిన చోరీలపై ప్రత్యేక దృష్టి సారించారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా చోరీలకు పాల్పడినట్లు అంగీకరించాడు. ఇతను గతంలో వైజాగ్ ప్రాంతంలో చోరీలకు పాల్పడేవాడని తెలిసింది. అతని వద్ద నుంచి 13 సవర్ల బంగారు ఆభరణాలు రకవరీ చేశారు. చోరీ కేసులను చేదించి నిందితుడిని అరెస్టు చేసిన తడ పోలీస్ స్టేషన్ సిబ్బంది వెంకటేశ్వర్లు, నాగార్జున, నాగరాజు, సుబ్రహ్మణ్యం, షేక్ సుహేల్, రాజేష్‌ను డీఎస్పీ అభినందించారు. ఈకార్యక్రమంలో సీఐ మురళీకృష్ణ పాల్గొన్నారు.

కలశం ఊరేగింపు



కలశాన్ని తీసుకెళ్తతన్న సునీల్‌కుమార్

గూడూరు, అక్టోబరు 2: స్థానిక సాయిసత్సంగ నిలయంలోని విజయ దుర్గాదేవి ఉపపీఠంలో బుధవారం అమ్మవారి శరన్నవరాత్రుల సందర్భంగా కలశస్థాపన కార్యక్రమం ప్రారంభించారు. గ్రామదేవత తాళమ్మ ఆలయంలో సాయిసత్సంగ నిలయం నిర్వాహకుడు కోట సునీల్‌కుమార్ పూజలు నిర్వహించి కలశాన్ని నెత్తిపై పెట్టుకుని సాయిసత్సంగ నిలయానికి చేరుకున్నారు. శుక్రవారం విజయదుర్గాదేవి వద్ద కలశస్థాపన పూజలు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

నేటి నుంచి కలివేలమ్మ ఆలయంలో పూజలు

వెంకటగిరి, అక్టోబరు 2: వెంకటగిరి పట్టణంలోని తూర్పువీధిలో వెలసిన కలివేలమ్మ ఆలయంలో శరన్నవరాత్రుల్లో భాగంగా 9 రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా గురువారం మాను ఉత్సవం నిర్వహిస్తారు. శుక్రవారం నుంచి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పూలతో అలంకరించిన సప్రం(రథం)పై ఉంచి 9 రోజుల పాటు పంబలోళ్ల దరువులు, కొమ్ముల కిలారింపుల నడుమ పురవీధుల్లో ఊరేగిస్తారు. 7వ తేది సోమవారం అమ్మవారికి దిష్టి చుక్క, 10వ తేది గురువారం వేంచేపు, 11వ తేది ఊంజలసేవ కార్యక్రమాలు జరుగుతాయి. అదేరోజు అమ్మవారిని కాంపాళెం వద్ద ఉన్న పుట్టింటి వరకు ఊరేగించి తీసుకువస్తారు.

విశాఖ ఉక్కును ప్రైవేటీకరిస్తే సహించేది లేదు

గూడూరు, అక్టోబరు 2: విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ చేస్తే సహించేది లేదని వామపక్ష నాయకులు హెచ్చరించారు. బుధవారం స్థానిక టవర్‌క్లాక్ కేంద్రం వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిశ్రమను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టాలని బీజేపీ ప్రభుత్వం ప్రయత్నాలు చేయడం దుర్మార్గమన్నారు. ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ అంశాన్ని కేంద్రప్రభుత్వం మానుకోవాలని, లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో చంద్రయ్య, నారాయణ, ప్రభాకర్, శశికుమార్, కాలేషా, శివకుమార్, శ్రీనివాసులు, బీవీరమణయ్య, శంకరయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

అమావాస్య పూజలు

నాయుడుపేట టౌన్, అక్టోబరు 2: మండలంలోని చలివేంద్రం వద్ద వెలసిన వైద్య వీరరాఘవయ్యస్వామి ఆలయంలో అమావాస్య పూజలు నిర్వహించారు. బుధవారం మహాలయ అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకొని వైద్య వీరరాఘవయ్యస్వామికి అభిషేకాలు, అష్టోత్తర పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

టెట్ సెంటర్ పరిశీలన

గూడూరు అర్బన్: స్థానిక నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలోని టెట్ (టీఈటీ) పరీక్షా సెంటర్‌ను బుధవారం జిల్లా పరిశీలకుడు ప్రసన్నకుమార్ పరిశీలించారు. గురువారం నుంచి నిర్వహించనున్న పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు అవసరమైన వసతులను కల్పించేలా చర్యలు తీసుకోవాలని స్థానిక అధికారులకు సూచించారు. ఆయన వెంట మల్లి కార్జున్‌రావు, సనత్ కుమార్ ఉన్నారు.

ప్రజా ఉద్యమ నేత ఏచూరి: విఠపు

సూళ్లూరుపేట, అక్టోబరు 2: ప్రజా ఉద్యమ నేత సీతారాం ఏచూరి అని మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం అన్నారు. బుధవారం స్థానిక శేషసాయి కల్యాణ మండపంలో సీపీఎం సీనియర్ నాయకుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఏచూరి సంస్మరణ సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ విఠపు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి ప్రజా ఉద్యమ నేతగా ఎదిగిన సీతారాం తన జీవితకాలం ప్రజాసేవకే అంకితం చేశారన్నారు. ఆయన మరణం దేశానికి తీరని లోటని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి నాగరాజు, సీఐటీయూ నాయకులు బాలసుబ్రహ్మణ్యం, మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్ రెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఆకుతోట రమేష్, అల్లెయ్య, రియాజ్, పద్మనాభం, సాంబశివయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ సభలను విజయవంతం చేయండి

గూడూరు అర్బన్, అక్టోబరు 2: విజయనగరంలో ఈనెల 6,7,8 తేదీల్లో నిర్వహించనున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిరంజీవి అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మహాసభల పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో కోదండరామ్, బాబు, జైపాల్‌రెడ్డి, శివకుమార్, భాస్కర్‌రెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.





